రక్తదానం..ప్రాణదానంతో సమానం



దేవరకొండలో రక్తదానం చేస్తున్న డీఎస్పీ, సీఐలు, ఎస్సైలు

దేవరకొండ, న్యూస్‌టుడే: రక్తాన్ని ఎవరూ తయారు చేయలేరని, ఆపదలో రక్తదానం ప్రాణాలు కాపాడుతుందని డీఎస్పీ గిరిబాబు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దేవరకొండలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో డివిజన్ పరిధిలోని డీఎస్పీ గిరిబాబు, సీఐలు, ఎస్సైలు రక్తదానం చేశారు. శిబిరంలో 100 మందికి పైగా పాల్గొని రక్తదానం చేయడం ఎంతో సంతోషకరమన్నారు. అనంతరం వారికి ధ్రువపత్రాలు అందజేశారు. దేవరకొండ సీఐ నర్సింహులు, రూరల్ సీఐ సురేష్, కొండమల్లేపల్లి సీఐ ధనుంజయ, నాంపల్లి సీఐ నవీన్‌కుమార్, ఎస్సైలు అజ్మీరారమేష్, కోటేశ్వర్, విల్సన్, వెంకటయ్య, సతీష్, రాజు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, గాజుల రాజేష్, సముద్రాల ప్రభాకర్, పిజె సాంసన్, చీదెళ్ల వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది హరి తదితరులున్నారు.

ధాన్యం సేకరణపై సమీక్ష



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: వానాకాలం ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పౌరసరఫరాలశాఖ అధికారులు, మార్కెటింగ్, డీఆర్‌డీవో, సహకారశాఖ, వ్యవసాయశాఖ అధికారులతో ధాన్యం సేకరణ సమస్యలపై సమీక్షించారు. కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు కొరత లేకుండా చూడాలన్నారు.

ఎంజీయూలో జాతీయ గణిత దినోత్సవాలు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం గణితశాఖ, తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో గురువారం వర్సిటీలో జాతీయ గణిత దినోత్సవాలను నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంజీయూ వీసీ ప్రొ.అల్తాఫ్ హుస్సేన్, గణిత విభాగాధిపతి డా.పి.మద్దిలేటి, డా.కొల్లోజు ఫణీంద్ర, వసంత, ప్రేమ్‌సాగర్, ఉపేందర్‌రెడ్డి, హైమావతి, శ్రీనివాస్, కిరణ్‌కుమార్, రామచంద్రు పాల్గొన్నారు.

సిబ్బంది పనితీరు మెరుగుపడాలి: డీఎంహెచ్‌వో

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరు మరింత మెరుగుపడాలని డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్ అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన నల్గొండ డివిజన్ వైద్యాధికారులు, ఏఎన్ఎంల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు సకాలంలో అమలయ్యేలా చూడడంతో పాటు గ్రామీణ ప్రాంతంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. పనితీరులో మార్పు రాకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రోగ్రాం అధికారులు డా.కల్యాణ్ చక్రవర్తి, అరుంధతి పాల్గొన్నారు.

ప్రజల వద్దకు ఎస్పీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం మీట్ యువర్ ఎస్పీ పేరుతో కార్యక్రమాలు చేపడుతున్నారు. శుక్రవారం ఎస్పీ శరత్ చంద్ర పవార్ జిల్లాలోని చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 11 గంటల నుంచి అందుబాటులో ఉండనున్నారు. స్టేషన్ పరిధిలోని బాధితులు నేరుగా కలిసి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని ఎస్పీ కోరారు.

కందుల ధర అదిరె..!

డిండి: డిండితోపాటు చెర్కుపల్లి వ్యవసాయ విత్తనోత్పత్తి కేంద్రంలో 2023లో పండించిన(పీఆర్‌జీ-176) రకం 67 క్వింటాళ్ల కందులకు గురువారం వ్యవసాయశాఖ అధికారులు వేలం నిర్వహించారు. ఈ వేలంలో ఐదురుగు పాల్గొనగా మిర్యాలగూడకు చెందిన కె.శ్రీనివాస్ క్వింటాకు రూ.7560 చొప్పున దక్కించుకున్నారు. ఏడీఏలు నివేదిత, శ్రీలక్ష్మి, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి కిరణ్, ఏవోలు రామలింగేశ్వర్‌రావు, వెంకటన్న, సీడ్ ఆఫీసర్ రాంబాబు పాల్గొన్నారు.

రైతులకు సహకరించండి

గుర్రంపోడు: ధాన్యం తెచ్చే రైతులకు సిబ్బంది సంపూర్ణంగా సహకరించి వారికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి, మండల ప్రత్యేకాధికారి వి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం గుర్రంపోడు మండలం కొయిగూరోనిబాయి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కొప్పోలులోని పీఏసీఎస్ కేంద్రం, చాంలేడులోని డీసీఎంఎస్ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రతి రైతు ఆక్యూవెదర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీడీవో మంజుల, వ్యవసాయాధికారి మాధవరెడ్డి, గోపాల్‌రెడ్డి, యాదయ్య, సైదులుగౌడ్ పాల్గొన్నారు.

జాతీయ పురస్కారానికి ఎంపిక



సందీప్‌కుమార్

మిర్యాలగూడ పట్టణం: వివిధ సేవా కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు లక్ష విత్తనాలు సేకరించి నాటడం, మరో లక్ష విత్తనాల సేకరణ చేపట్టడం వంటి కార్యక్రమాలు చేస్తున్నందుకు మిర్యాలగూడకు చెందిన అవిరెండ్ల సందీప్ కుమార్.. సూర్యాపేటకు చెందిన హోప్ స్వచ్ఛంద సేవా సమితి, సింధు ఆర్ట్స్ అకాడమీ వారి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. సంస్థ వ్యవస్థాపకుడు దైద వెంకన్న సమాచారం అందించినట్లు స్థానికంగా తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కూలీ మృతి, ఇద్దరికి గాయాలు



నకిరేకల్, న్యూస్‌టుడే: హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై నకిరేకల్ శివారులోని చందంపల్లి స్టేజీ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. నకిరేకల్ పుర పరిధి పన్నాలగూడకు చెందిన లింగంపల్లి నీలమ్మ, ఏ.జ్యోతి, జి.భాగ్యమ్మలు సమీపంలోని బైరెడ్డిగూడెంలో పత్తిచేనులో కూలీ పనులకు వెళ్లారు. తిరిగి సాయంత్రం ఇంటికి వస్తూ జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తున్న గుర్తుతెలియని ట్యాంకర్ వీరిని ఢీకొట్టింది. ప్రమాదంలో లింగంపల్లి నీలమ్మ(42) అక్కడికక్కడే మృతిచెందారని ఎస్సై లచ్చిరెడ్డి తెలిపారు. గాయపడిన ఇద్దరిని నల్గొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించామని, సీఐ పి.రాజశేఖర్ నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులున్నారు. వీరి సొంత గ్రామం కడపర్తి కాగా.. చాలా కాలం నుంచి నకిరేకల్ పన్నాలగూడలో నివాసం ఉంటున్నారు.


బీమా.. అన్నదాతకు ధీమా..!

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:



ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి అందివచ్చే తరుణంలో ప్రకృతి విపత్తుల కారణంగా నష్టం జరగడం ఉమ్మడి నల్గొండ జిల్లాలో సర్వసాధారణంగానే మారింది. ఏటా అకాల వర్షాలు, వడగళ్ల వానలు రైతులను కోలుకోలేని దెబ్బతీస్తున్నాయి. రూ.వేలు పెట్టుబడి పెట్టి నిరాశకు గురవుతున్నారు. ఈ విషయమై ప్రభుత్వం రైతులను ఆదుకునే క్రమంలో పంటల బీమా అమలు చేయాలని సంకల్పించింది. ఇటువంటి పరిస్థితుల్లో పంటల బీమాను వచ్చే సీజన్ నుంచి ప్రారంభిస్తామని తాజాగా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించడంతో కర్షకుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొత్తం సుమారు 9,08,810 మంది రైతులుండగా, సుమారు 18.08 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటల సాగును చేపడుతున్నట్లు అధికారులంటున్నారు.



ప్రయోజనం ఇలా..

ఉమ్మడి నల్గొండ జిల్లాలో అధిక శాతం వ్యవసాయం పైనే ఆధారం. ముఖ్యంగా సింహభాగం రైతులు వరి, పత్తి, మొక్కజొన్న, కందితోపాటు కూరగాయలు సాగు చేపడుతుంటారు. వన్యప్రాణుల బెడదకు తోడు వేలాది ఎకరాల్లో ప్రతిఏటా వడగళ్లు, అకాల వర్షాలు కురిసి ఇక్కడి పంటలకు తీవ్రంగా నష్టం జరగడం పరిపాటి అనే చెప్పవచ్చు. ఇలాంటి తరుణంలో సదరు పంటలకు బీమాతో ప్రయోజనం చేకూరనుందన్నది వాస్తవం. ముఖ్యంగా వడగళ్లు కురిసినా.. వర్షాలు లేక పంటలు ఎండిపోయినా సాగు సమయంలో రైతులు వాటికి బీమా చేసుకుంటే ఉపయోగంగా ఉంటుంది. గతంలో గ్రామం యూనిట్‌గా బీమా చేస్తుండేవారు. దీనివల్ల కర్షకులకు ప్రయోజనం ఉండేది. ఎకరాకు రూ.500 ప్రీమియం చెల్లిస్తే నష్టపోయిన సమయంలో రూ.వేలాదిగా డబ్బులు వస్తుండేవి. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న సమయంలో బీమా ప్రీమియం డబ్బులు తీసుకునేవారు. నష్టపోతే వరికి ఎకరాకు రూ.37,484, పత్తి రూ.38,282, మొక్కజొన్నకు రూ.18,742 పరిహారం వచ్చేది.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలి

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



సూర్యాపేటలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో పేదరిక నిర్మూలనకు అధికారులు, ప్రజా ప్రతినిధులు, రచయితలు, కళాకారులు భాగస్వాములు కావాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో గురువారం భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలో స్వయం సహాయక మహిళా సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని.. భవిష్యత్తు మహిళా సాధికారతపైనే ఆధారపడి ఉందని చెప్పారు. వైద్యారోగ్యం, విద్యారంగాలను పరిశీలిస్తే జిల్లా మెరుగైన స్థానంలో ఉందన్నారు. 2024లో పదో తరగతిలో 96.91 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని కొనియాడారు. విద్యార్థులకు విద్యతో పాటు చేతి వృత్తులకు సంబంధించి వస్తువుల తయారీలో మెలకువలు అందిస్తే మరింత విజ్ఞానవంతులు అవుతారని పేర్కొన్నారు.

ఘన స్వాగతం

జిల్లాకు వచ్చిన గవర్నర్‌కు రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, అధికారులు ఘన స్వాగతం పలికారు. తొలుత రాష్ట్ర గవర్నర్ సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయ ఆవరణలో వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జిల్లా అధికారులు, ప్రముఖుల ముఖాముఖిలో పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా ప్రాముఖ్యం, సంస్కృతి, సంప్రదాయాలు, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు తెలియజేశారు. పలువురు కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, జాయింట్ సెక్రటరీ భవాని శంకర్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్, సూర్యాపేట, కోదాడ, తిరుమలగిరి పురపాలిక ఛైర్‌పర్సన్లు పెరుమాళ్ల అన్నపూర్ణ, గెల్లి అర్చన, అనసూయ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరిస్తాం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



సూర్యాపేటలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం

తెలంగాణ రాష్ట్రం కేంద్ర ప్రభుత్వానికి అన్ని విషయాలలో చురుకైన సహకారం అందిస్తోందని, ఆహార భద్రతలో భాగంగా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికీ ఆరు కిలోల బియ్యం అందజేస్తున్నామని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. జనవరి నుంచి సన్న బియ్యాన్ని అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రాబోయే రోజుల్లో సూర్యాపేట జిల్లాను రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా చేయాలన్నదే తమ లక్ష్యమని చెప్పారు. జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇస్తామని తెలిపారు. సూర్యాపేటకు సంస్కృతి, సంప్రదాయాలతోపాటు చరిత్రాత్మకంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్నాయని వెల్లడించారు.

జాతి నిర్మాణంలో యువతే కీలకం



ఎంజీయూలో ఎన్‌సీసీ కార్యాలయం ప్రారంభోత్సవంలో వీసీ అల్తాఫ్ హుస్సేన్, 31వ బెటాలియన్ కల్నల్ లక్ష్మారెడ్డి, తదితరులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: జాతి నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వీసీ ప్రొ.అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. గురువారం ఎంజీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ కార్యాలయంను ఆయన ప్రారంభించారు. ఎన్‌సీసీలో సేవలందించే విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుంటారని తెలిపారు. విద్యార్థి దశ నుంచే సమాజ సేవపై ఆసక్తి కనబర్చాలని కోరారు. అనంతరం 31వ బెటాలియన్ కల్నల్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఎంపికల్లో భాగంగా విద్యార్థులకు రాతపరీక్ష, దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ప్రిన్సిపల్ సుధారాణి, ఓఎస్డీ కె.అంజిరెడ్డి, మచ్చేందర్, హరీశ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రేఖ, పాల్గొన్నారు.

కంటిపాప జ్ఞాపకంగా.. జ్ఞానాన్ని పంచుతూ

నీలగిరి, న్యూస్‌టుడే: తమ ఆశయాలను పిల్లల్లో చూసుకొని మురిసే తల్లిదండ్రులకు.. వారి పేగు బంధం శాశ్వతంగా దూరమైతే ఆ బాధ వర్ణనాతీతం. బిడ్డ దూరమైన బాధ నుంచి ఉపశమనం పొందేందుకు వారి పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం మనం చూస్తుంటాం. కానీ తాము చేసే కార్యక్రమం అందరికీ ఉపయోగపడాలని ఆలోచించిన నాగిరెడ్డి-మంగ దంపతులు కుమారుడి పేరుతో స్థానిక రవీందర్‌నగర్‌లో ఓ భవనం నిర్మించి.. విజ్ఞానాన్ని పంచే విధంగా గ్రంథాలయం, యోగా, ధ్యాన సాధన కోసం అన్ని సదుపాయాలను ఏర్పాటు చేశారు.



నాగిరెడ్డి-మంగ దంపతులు



ఫణివిహార్ భవనంలోని గ్రంథాలయంలో చదువుకుంటున్న నిరుద్యోగులు

ఆరోగ్యం.. విజ్ఞానం అందించాలని - నాగిరెడ్డి

మా అబ్బాయి ఉన్నత విద్య పూర్తి చేసి ఉద్యోగసాధనలో ఉండగా అనారోగ్యంతో మరణించాడు. లైబ్రరీ సైన్స్ చదువుకున్న కుమారుడు ఫణిందర్‌రెడ్డి పేరుతో ఫణివిహార్ భవనం నిర్మించాం. ఆయనకు పుస్తకాలు అంటే ఇష్టం. అందుకే నిరుద్యోగులు చదువుకోవడానికి పుస్తకాలు, దినపత్రికలతో గ్రంథాలయం ఏర్పాటు చేశాం. దీంతో పాటు రామచంద్ర మిషన్, సత్యసాయి ధ్యాన మండలిలో చేసే సేవా కార్యక్రమాలలో ఎంతో కాలంగా భాగస్వాములు అవుతున్నాం. యోగా సాధన ఉచితంగా నేర్పించేందుకు మాస్టర్‌ని నియమించాం. పోటీ పరీక్షల కోసం చదువుకునే వారు ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉంటారు.

పోలీసుల సంక్షేమానికి కృషి: ఎస్పీ

నల్గొండ అర్బన్: జిల్లాలో పోలీసుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్ చంద్రపవార్ అన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా గురువారం పలువురు పోలీసు అమరుల కుటుంబ సభ్యులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతిఫలాలు సకాలంలో అందేలా చూస్తామని తెలిపారు. జిల్లాలో 15 మంది సంఘ విద్రోహ శక్తులతో పోరాడి అమరులయ్యారని.. వారి త్యాగాలు మరువలేనివన్నారు. అనంతరం జిల్లా పోలీస్‌కార్యాలయంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. పోలీస్ సిబ్బంది 300 యూనిట్ల రక్తదానం చేసినట్లు పేర్కొన్నారు. అదనపు ఎస్పీ రాములు నాయక్, డీఎస్పీలు రమేశ్, శివరాంరెడ్డి, శ్రీనివాస్, సీఐలు పాల్గొన్నారు.



అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

అధిక దిగుబడి.. అవార్డు రాబడి

కేతేపల్లి, త్రిపురారం, న్యూస్‌టుడే: కేతేపల్లి మండలంలోని కాసనగోడు గ్రామానికి చెందిన యువరైతు సయ్యద్‌అలీకి, త్రిపురారం మండలం నీలాయిగూడెం గ్రామానికి చెందిన కోట చిన్న సైదులుకు జాతీయ ఉత్తమ రైతు అవార్డును రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం.కోదండరెడ్డి అందించారు. భారతీయ వరి పరిశోధన సంస్థ (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో రైతు దినోత్సవం సందర్భంగా అవార్డులను గురువారం హైదరాబాద్‌లో అందజేశారు. సాగులో ఎప్పటికప్పుడు వస్తున్న ఆధునిక పద్ధతులకు అనుగుణంగా పంటసాగు చేస్తూ అధిక దిగుబడులు సాధించినందుకు వీరికి ఈ గుర్తింపు దక్కింది.



సయ్యద్‌అలీ, కోట చిన్న సైదులుకు ఉత్తమ అవార్డు అందజేస్తున్న రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి

శిక్షణ ఐఏఎస్‌లతో సమావేశం

కొండమల్లేపల్లి: పెండ్లిపాకల గ్రామంలో గత నాలుగు రోజులుగా శిక్షణ ఐఏఎస్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు తీరుపై అధ్యయనం చేస్తున్నారు. గురువారం వారితో డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. గ్రామంలో వారు అధ్యయనం చేసిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉందని, వారి సంఖ్య పెంచటానికి తీసుకోవాల్సిన అంశాలపై సలహాలు, సూచనలు చేశారు. అనంతరం వారితో మండలంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి కృషి చేస్తున్న దాత, మాజీ ఎంపీపీ దూదిపాల రేఖ-శ్రీధర్‌రెడ్డి దంపతులు సమావేశమయ్యారు.

సజావుగా పంటల డిజిటల్ సర్వే

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల డిజిటల్ సర్వేను వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవోలు) గురువారం నుంచి ఉమ్మడి జిల్లాలో చేపడుతున్నారు. నెల రోజులుగా పంటల డిజిటల్ సర్వేపై కొనసాగుతున్న ప్రతిష్టంభన ముగిసింది. హైదరాబాద్‌లోని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో ఏడు రోజులు సర్వేలో పాల్గొంటామని వివరించినట్లు ఏఈవోల సంఘం నాయకులు తెలిపారు.

ప్రతిష్టంభనకు కారణమేంటంటే..

భవిష్యత్తులో ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే పంట నష్టాన్ని అంచనా వేయడం, ఆహార ధాన్యాల ఎగుమతి, పంట ఉత్పత్తుల కొనుగోలు, సాగు ప్రణాళిక తదితరాలకు పంటల డిజిటల్ సర్వే ఆధారం కానుంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం డిజిటల్ అగ్రి మిషన్ పథకాన్ని తీసుకువచ్చింది. అమలు చేసేందుకు ఆయా రాష్ట్రాలకు నిధులు మంజూరు చేసింది. పథకంలో భాగంగా చేపట్టే పంటల సర్వేకు స్థానిక యువతను ఉపయోగించుకుని ఉపాధి కల్పించాలని సూచించింది. వివిధ రాష్ట్రాల్లో ఇదే విధానం అమలవుతోంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏఈవోల ద్వారా సర్వే చేయించాలని చూస్తుండటంతో సమస్య ఉత్పన్నమైంది. ఒక్కో క్లస్టర్ పరిధిలో వేల ఎకరాల భూమి సాగవుతోందని, సహాయకులు లేకుండా సర్వే చేయడం సాధ్యం కాదని ఏఈవోలు చెప్పడంతో ప్రతిష్టంభన కొనసాగింది.

ఉమ్మడి జిల్లాలో ఏఈవోలు	
నల్గొండ	140
సూర్యాపేట	98
యాదాద్రి	72

చర్చల అనంతరం..

పనిభారం ఎక్కువవుతోందని, డిజిటల్ సర్వే చేయలేమని ఏఈవోలు ప్రభుత్వానికి చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం సహాయ సిబ్బందిని నియమిస్తే సర్వే చేస్తామని తెలిపారు. వ్యవసాయశాఖ సంచాలకులతో చర్చల అనంతరం పంటల డిజిటల్ సర్వే చేపట్టడానికి సుముఖత వ్యక్తం చేశారు.



నల్గొండ మండలం తొరగల్ క్లస్టర్‌లో డిజిటల్ సర్వే చేస్తున్న ఏఈవో సత్యనారాయణ

వ్యవసాయశాఖ సంచాలకులు హామీ ఇచ్చారు.

– సత్యనారాయణ ఏఈవోల సంఘ జిల్లా అధ్యక్షుడు, నల్గొండ

ఏడు రోజుల పాటు సర్వే నిర్వహించిన తర్వాత ఏఈవోలకు ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వ్యవసాయశాఖ సంచాలకులు హామీ ఇచ్చారు. గురువారం నుంచి పంటల డిజిటల్ సర్వే నిర్వహిస్తున్నాం. అనంతరం తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే మళ్లీ ఐక్య కార్యాచరణతో ముందుకెళ్తాం.

నాలుగు కి.మీ. ప్రయాణం.. నరకప్రాయమే

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్- కడపర్తి గ్రామం మధ్య రహదారి గోతులమయంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కడపర్తి గ్రామం నుంచి 365వ నెంబర్ జాతీయ రహదారి వరకు, నకిరేకల్ నుంచి కూడలి వరకు ఈ రెండు బిట్లలో నాలుగు కిలోమీటర్ల మేర రహదారి పూర్తిగా ధ్వంసమైంది. శాలిగౌరారం మండలంలోని అన్ని గ్రామాలకు వెళ్లేవారు నిత్యం రాకపోకలు సాగిస్తూ అవస్థలు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. అభివృద్ధి, విస్తరణ కోసం రాష్ట్ర ప్రణాళిక నిధులు రూ.10 కోట్లు మంజూరు కావడంతో ఆరు నెలల క్రితం పనుల ప్రారంభోత్సవాన్ని నిర్వహించారు. నేటికి పనులు పట్టాలు ఎక్కలేదు.

చేపడతాం: – సంతోశ్‌కుమార్, ఏఈ ఆర్‌అండ్‌బీ

రహదారి అభివృద్ధి పనుల కోసం విద్యుత్ లైన్లను మార్పు చేసేందుకు ఆ శాఖ అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరాం. అవి అందగానే లైన్లు తరలించి రహదారి పనులు త్వరలోనే మొదలు పెట్టే విధంగా చర్యలు తీసుకుంటాం.



కడపర్తి గ్రామం నుంచి 365వ నంబర్ జాతీయ రహదారి వరకు స్థానిక రోడ్డుపై గుంతలు ఇలా..

సూర్యాపేట పట్టణంలో ఓ శుభకార్య వేదికలో హంగు, ఆర్భాటాలతో వివాహం జరిగింది. ఆహార పదార్థాలకు రూ.12 లక్షలు ఖర్చు చేసి, 16 రకాల వంటకాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమం ముగిశాక చూస్తే అతిథులకు వడ్డించిన విస్తర్లలోనే సుమారు రూ.2.5 లక్షల విలువైన పదార్థాలు వృథా అయినట్లు గుర్తించారు.

నల్గొండలో ఓ జంటకు తల్లిదండ్రులు వివాహం జరిపించారు. కట్నకానుకలు ఇతర సామగ్రికి రూ.2 లక్షలు పోను ఆహార పదార్థాలకు రూ.80 వేలు మాత్రమే వెచ్చించారు. రెండు రకాల కూరలు, అన్నం, సాంబారు, తీపి పదార్థాలను వడ్డించారు. వివాహానికి హాజరైనవారు తృప్తిగా భోంచేసి, అంతా బాగుందని కితాబిచ్చారు.

తినాలనే ఆశ.. వృథాపైనే ధ్యాస

నాంపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో ఏటా భారీ సంఖ్యలో వివాహాలు జరుగుతున్నాయి. భారీస్థాయిలో హంగు ఆర్భాటాలకు వెళ్తూ.. లక్షలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. పొదుపు మంత్రం పాటిస్తేనే పెళ్లి చేసే తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకుండా జాగ్రత్త పడవచ్చు. ముందే మేల్కొని వివాహ ఖర్చులపై పూర్తి అవగాహన కలిగి ఉంటేనే ప్రయోజనం చేకూరే అవకాశాలున్నాయని నిపుణులు సూచిస్తున్నారు.



★ 2011 లెక్కల ప్రకారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో 34.57 లక్షల జనాభా నివసిస్తోంది. ఏటా సుమారు 8 వేల నుంచి 10వేల వరకు పెళ్లిళ్లు జరుగుతున్నాయి. చిన్నస్థాయిలో చేసుకునే వివాహాలకు సాధారణంగా ఆహారానికి రూ.లక్ష వరకు, స్థాయిగల కుటుంబాల్లో రూ.1.5లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. సంపన్న వర్గాల కుటుంబాల్లో రూ.10 నుంచి రూ.25 లక్షల వరకు ఆహారానికి ఖర్చు చేస్తున్నారు. ఇంతలా అతిథి ఆతిథ్యం కోసం చేస్తున్న ఖర్చును అతిథులే గుర్తించకుండా చెత్తబుట్టలో వేస్తుండటంతో ఆర్థిక, పర్యావరణ సమస్య ఉత్పన్నమవుతోంది. చిత్తశుద్ధితో వ్యవహరిస్తే వృథా నియంత్రణకు అవకాశాలున్నాయి.

ఆలోచించండి

మీరు ఓ వివాహానికి వెళ్లారు. అక్కడ ప్లేట్ నిండా ఆహార పదార్థాలు వడ్డిస్తారు. మీరు వద్దన్నా.. ఆప్యాయంగా తినండని మర్యాద చేస్తారు. తీరా మీకు నచ్చినవి తిని మిగతావి పారేస్తారు. ఒక్క క్షణం ఆలోచించండి మీరు ఎంత వృథా చేశారో తెలుస్తుంది. అక్కడ అధిక సంఖ్యలో ఆహార పదార్థాలను ఏర్పాటు చేయడంతో ఏది తినాలో తెలియక అన్ని రుచి చూడాలని గిన్నె నిండా పెట్టుకుంటారు. మొత్తం తినలేక వృథా చేస్తారు.

గతంలో..

గతంలో అయితే శుభకార్యాల్లో అతిథులను కింద కూర్చోపెట్టి లేదా కుర్చీలు, టేబుళ్లు వేసి భోజనాలు వడ్డించేవారు. ఈ విధానంతో ఆహార పదార్థాలు తినకుండా వదిలేసేవారిని గుర్తించే అవకాశం ఉండటంతో వృథా తక్కువగా ఉండేది. ప్రస్తుతం వేడుక ఏదైనా పల్లె పట్టణమనే తేడా లేకుండా నిలబడి తినే (బఫే)విధానాన్నే అవలంబిస్తున్నారు. దీంతో ఆహార పదార్థాలు అలా రుచి చూసి ఇలా వదిలేస్తుండటంతో వడ్డించుకున్న పదార్థాల్లో 25శాతం వరకు చెత్త డబ్బాల్లోకే చేరుతోంది.

అన్నం పరబ్రహ్మ స్వరూపం..

'అన్నం పరబ్రహ్మ స్వరూపం' అంటారు. రోజూ ఎంతో మంది పేదలు ఆహారం దొరక్క అల్లాడుతున్నారు. గుప్పెడు మెతుకుల కోసమే కోట్లాది మంది పొట్టచేత పట్టుకొని వలస బాట పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో నిత్యం జరిగే వేడుకల్లో భారీగా ఆహార పదార్థాలు వృథా అవుతున్నట్లు అంచనా. నిర్వాహకులు పరిమితికి మించి ఆహార పదార్థాలు తయారు చేయకుండా ఉంటే మంచిది. వేడుకలకు వెళ్లే అతిథులు ఆయా శుభకార్యాలు తమవిగా భావించాలి. ఆకలికి తగ్గట్టుగా వడ్డించుకోవాలి. భోజనం మధ్యలో మీరు చెత్త డబ్బా వద్దకు వెళ్తున్నారంటే కచ్చితంగా ఆహారం వృథా చేస్తున్నట్టే లెక్క. ఏదైనా శుభకార్యాలు, ఇతర వేడుకల్లో ఆహారం మిగిలితే పారేయకుండా స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకొని అనాథలకు అందజేస్తే ప్రయోజనం ఉంటుంది.

స్వయం శోధన... నిత్య సాధన

చిట్యాల, న్యూస్‌టుడే: భిన్న వ్యాపకాలను ఎంచుకుని వాటిపై స్వయంగా శోధిస్తూ, నిత్యసాధన చేస్తున్నారు చిట్యాలకు చెందిన పంతంగి నవీన్, హరిత కుమార్తెలు మేఘన, సాయిలేఖన. మేఘన ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో హోమియో వైద్యురాలిగా పనిచేస్తూ.. చిత్రలేఖనాన్ని, సాయిలేఖన హైదరాబాద్ గీతం విశ్వవిద్యాలయంలో బీఏ సైకాలజీ మొదటి సంవత్సరం చదువుతూ.. సంగీత పరికరాల వాయిద్యాన్ని ప్రవృత్తిగా ఎంచుకున్నారు. ఎలాంటి ప్రత్యేక శిక్షణ లేకుండానే ఎవరికి వారు ఆన్‌లైన్‌లో స్వయంగా శోధిస్తూ.. దానిపై పట్టు సాధించడానికి నిత్యం కనీసం రెండు గంటలు సాధన కోసం కేటాయించుకుంటున్నారు. తాము ఎదుర్కొనే ఒత్తిడిని తమ వ్యాపకాలతో అధిగమిస్తున్నామంటున్నారు.

నేర్పించిన చిట్కాలతో..:

డాక్టర్ పంతంగి మేఘన



చిన్నప్పుడు (మూడో తరగతిలో)మా పాఠశాలలో బొమ్మలు గీయడంలో ప్రాథమిక మెలకువలు నేర్పించేవారు. ఇంటి దగ్గర చిత్రకారుడైన మా చిన్నతాతయ్య మధుసూదన్ రావు చిత్రలేఖనంలో చిట్కాలు చెప్పేవారు. ఒత్తిడిని అధిగమించడానికి చాలామంది యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి చేస్తుంటారు. నేను చిత్రలేఖనంతో ఒత్తిడిని అధిగమిస్తాను. ఏదైనా ముఖ్యమైన నిర్ణయం తీసుకోవాలనుకున్నపుడు పెయింటింగ్ వేయడం అలవాటయింది. పెన్సిళ్ల నుంచి బ్రష్షులు, రంగులు, కాగితాల వరకు ఆన్‌లైన్‌లో చూసి కొనుగోలు చేస్తుంటాను. పెద్దచిత్రాలు రెండు రోజులు, చిన్న చిత్రాలయితే ఒక రోజులో పూర్తి చేస్తాను. హోమియో చదువుతున్నపుడు అంతర్ కళాశాలల మధ్య చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అందులో బహుమతి గెలుచుకోవడం మరపురాని అనుభూతి.

నిత్యం రెండు గంటలపాటు..

పంతంగి సాయిలేఖన



నేను ఇష్టంగా వరసగా ఒక్కొక్కటిగా కొనుగోలుచేసిన సంగీత పరికరాలతో సాధన చేయడానికి నిత్యం రెండు గంటల సమయం కేటాయించుకుంటాను. ప్రస్తుతం గిటార్, ఖలింబ(పియానోకు చిన్నవెర్షన్), వయోలిన్, క్లావ్‌బాక్సు, యుకులేలి, ఫ్లూట్ నాదగ్గర ఉన్నాయి. అన్నీ యూట్యూబ్‌లో చూసి వాయించడాన్ని నేర్చుకున్నాను. నాలుగో తరగతి నుంచే పియానో వాయించడం ప్రారంభించాను. స్నేహితులు, టీచర్లు అభినందించి ప్రోత్సహించారు. ఏటా కొత్త పరికరం కొని సాధన చేయాలని సంకల్పంగా పెట్టుకున్నాను. అడిగిన పరికరాలను అమ్మానాన్న తెచ్చి ప్రోత్సహించారు. వారం క్రితం మా విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలోనూ నా వాయిద్య ప్రదర్శన ఇచ్చాను. సంగీతంలో ఏఆర్ రహమాన్, శంకర్ మహదేవన్‌లు స్ఫూర్తి.

జాతీయ స్థాయిలో నితిన్ ప్రతిభ



మేజిక్ ఫెస్ట్‌లో జ్ఞాపిక, నగదు అందుకుంటున్న నితిన్

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరుకు చెందిన కట్కం నితిన్ జాతీయ స్థాయిలో జరిగిన మెజిషియన్ ఉత్సవాల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి హాజరైన వారిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ నెల 20న కేరళలోని కొచ్చిలో 'మలయాళీ మెజిషియన్స్ అసోసియేషన్' పరంగా జాతీయ స్థాయిలో మేజిక్ ఫెస్ట్ నిర్వహించారు. దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ఇంద్రజాలికులు పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. తెలంగాణ నుంచి పాల్గొన్న 18 మందిలో నితిన్ ప్రథమం స్థానంలో నిలిచారు. సంస్థ తరపున ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు అందజేశారు. నితిన్‌ను స్థానిక పద్మశాలీ యువజన సంఘాల నాయకులు గురువారం ఆలేరులో సన్మానించారు. బేతి రాములు, బింగి నర్సింహులు, పాశికంటి శ్రీనివాస్, ఆడెపు బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి దారి.. అందంగా మారి

ఊరికి దూరంగా.. కంపచెట్లతో.. మురుగు నీటికి నిలయంగా.. పందులకు ఆవాసంగా.. వానొస్తే రోజుల తరబడి నీళ్లలో నివాసం.. దోమలు, దుర్వాసనల మధ్య కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితి ఒకప్పటి 60 ఫీట్ల దారిలోని ప్రజలది. ఆ దారి వెంట పదుల సంఖ్య జూనియర్ కళాశాలల నిర్వహణ మాత్రమే ఉండేది. పీఎస్‌ఆర్ సెంటర్ చివరి నుంచి అటు జాతీయ రహదారి వరకు అర కిలోమీటరు ఉండగా.. దాదాపు గుంతలే ఎక్కువగా దర్శనమిచ్చే దుస్థితి. కానీ నేడు ఆ దారి పరిస్థితి భిన్నంగా మారింది. దారి మొత్తం పూర్తిగా సీసీ రోడ్డు వెడల్పు పెంచేశారు. పలు విభిన్న వ్యాపారాలకు నిలయంగా మారింది. చిన్న హోటళ్ల నుంచి రెస్టారెంట్ల వరకు, పాఠశాలల నుంచి జూనియర్ కళాశాలల వరకు, టీస్టాళ్లు, సెలూన్ దుకాణాలు, సమోసా విక్రయ కేంద్రాలు, బేకరీలు ఇలా పదుల సంఖ్యలో వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఆ దారి ప్రస్తుతం నిత్యం రద్దీగా మారింది. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులతో సందడి నెలకొంటుంది. ఇప్పుడు ఇక్కడ దొరకని వస్తువంటూ లేదని స్థానికులు చెబుతున్నారు.



రద్దీగా.. సందడిగా.. సూర్యాపేట 60 ఫీట్ల రహదారి

పూర్తిగా మారిపోయింది..

– రామ్మూర్తి, టిఫిన్ బండి నిర్వాహకుడు, సూర్యాపేట

ముప్పై ఏళ్లుగా టిఫిన్ బండి నడుపుతున్నా.. గతంలో రద్దీ ప్రదేశమైన ఏపూరు బస్టాండ్ వద్ద నిర్వహించా. 60 ఫీట్ల దారిలో ప్లాటు ఉండగా ఇల్లు కట్టుకున్నా. మొదట్లో ఇక్కడే బండి పెడదామనుకున్నా. కానీ ఈ ప్రాంత పరిస్థితిని చూసి వ్యాపారం సాగుతుందో లేదోనని భయపడి పూర్వ స్థానంలోనే నిర్వహించా. ప్రస్తుతం రహదారి రూపురేఖలు పూర్తిగా మారిపోవడంతో ఇక్కడే ఏర్పాటు చేసుకున్నా. ఇప్పుడు అక్కడి కంటే ఇక్కడే వ్యాపారం బాగుంది. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, యువకులు, వృద్ధులతో ఆ దారంతా సందడి మారింది.

– సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే:

ఊడిన బస్సు టైరు.. పాదచారునికి గాయాలు

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: ట్రావెల్ బస్సు పరుగెడుతుండగా.. టైరు ఊడిపోయిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం లింగోజిగూడెం సమీపంలో చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి విజయవాడకు ప్రయాణికులతో ట్రావెల్ బస్సు గురువారం ఉదయం బయలుదేరింది. లింగోజిగూడెంలోని భారత్ పెట్రోలియం బంకు వద్దకు చేరుకోగానే ట్రావెల్ బస్సు వెనుక టైరు ఊడిపోయింది. ఊడిన టైరు జాతీయ రహదారి వెంట నడుచుకుంటూ వెళ్తున్న పాదచారుడికి తగలడంతో అతని కాలు విరిగింది. క్షతగాత్రుడు ఒడిశాకు చెందిన శశికాంత్ బిస్తాగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రుడిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. టైరు ఊడిపోయిన వెంటనే డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిదానంగా నిలపడంతో ప్రయాణికులు క్షేమంగా బయటపడ్డారు. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ పర్యవేక్షణలో ఎస్సై లక్ష్మయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఊడిపోయిన ట్రావెల్ బస్సు టైరు

హోరాహోరీగా కొనసాగిన క్రీడాపోటీలు

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి శ్రీనివాసనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలో గురుకులాల సొసైటీ ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయి క్రీడాపోటీలు రెండో రోజు(గురువారం) కొనసాగాయి. దామరచర్ల పాఠశాల, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ ఉమాదేవి ప్రారంభించగా.. విద్యార్థినుల మధ్య పోటీలు హోరాహోరీగా సాగాయి. విద్యార్థులు ఒకరిని మించి ఒకరు పోటీ పడుతూ ప్రతిభ చాటారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, రన్నింగ్ క్రీడా పోటీలు నిర్వహించారు.

అండర్-17 విభాగంలో.. కబడ్డీ: మొదటి స్థానం: దామరచర్ల గురుకులం విద్యార్థులు. తుమ్మడం గురుకులం విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు.



కబడ్డీ క్రీడలో తలపడుతున్న విద్యార్థినులు

ఖో-ఖో: 24 పాయింట్లు సాధించి నల్గొండ గురుకులం విద్యార్థులు మొదటి స్థానం. ఒకే ఒక పాయింట్ సాధించి వలిగొండ గురుకులం విద్యార్థులు రెండో స్థానంలో నిలిచారు.

రన్నింగ్: 100 మీటర్ల పరుగు పందెంలో దేవరకొండ గురుకుల విద్యార్థిని ఎస్. ఉమ మొదటి స్థానం. 400 మీటర్ల పరుగు పందెంలో నల్గొండ గురుకులం విద్యార్థినీ ఎం.ఇందు మొదటి స్థానం. 1500 మీటర్ల పరుగు పందెంలో భువనగిరి గురుకులం విద్యార్థిని వి.నవ్య మొదటి స్థానం. 4*100 మీటర్ల పరుగు పందెంలో నల్గొండ గురుకులం విద్యార్థిని ఎం.ఇందు. మొదటి స్థానంలో గెలుపొందారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రిన్సిపల్ సరిత, పీడీ ఇందిరా, పీఈటీ శాంతి, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

బంగారానికి మెరుగుపెడతామని మోసం

త్రిపురారం, న్యూస్‌టుడే: బంగారానికి మెరుగుపెడతాం, పూసలు అల్లుతామంటూ ఇద్దరు వ్యక్తులు ఓ గ్రామంలో తిరుగుతూ. . మోసానికి పాల్పడిన ఘటన వెలుగు చూసింది. బాధితుల వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా త్రిపురారం మండలం కామారెడ్డిగూడెం పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో గురువారం హైదరాబాద్‌లోని కార్మికనగర్‌కు చెందిన 60 ఏళ్ల వయస్సు పైబడిన పత్తిపాటి నాగరాజు, బొబ్బ వెంకట్‌రెడ్డి తిరిగారు. ఆ క్రమంలో గ్రామానికి చెందిన కొంగరి సునీత వారితో పూసలు అల్లించుకున్నారు. బంగారానికి మెరుగుపెడతాం అనే సరికి తనకున్న రెండు తులాల పుస్తెల తాడును వారికి ఇచ్చారు. పుస్తెల తాడును ద్రావణంలో కరగబెట్టడంతో రాగి కలర్‌లోకి వచ్చింది. బరువు సైతం తగ్గింది. ఇది గమనించే లోగా.. అప్పటికే నిందితులు గ్రామం నుంచి పరారయ్యారు. బాధితురాలు గ్రామస్థులకు తెలియజేయడంతో గ్రామంలోని యువకులు మండల పరిధిలోని పరిసర గ్రామాల్లో ఆచూకీ కోసం బైక్‌లపై వెళ్లారు. చివరికి కంపసాగర్ పరిధిలోని కేవీకే సమీపంలో పట్టుకొని నిలదీయగా నిజం ఒప్పుకొన్నారు. తిరిగి గ్రామానికి వారిని తీసుకెళ్లి బంగారాన్ని కరగబెట్టగా 20 గ్రాములకు గాను 17 నుంచి 18 గ్రాములే వచ్చింది. జరిగిన ఘటన ప్రచార మాధ్యమాల్లో వైరలైంది. గ్రామస్థులు వారిద్దరిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

బీసీ జేఏసీ ఛైర్మన్‌గా ధనుంజయ

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: ఉమ్మడి నల్గొండ జిల్లా బీసీ జేఏసీ ఛైర్మన్‌గా పెండెం ధనుంజయనేత నియమితులయ్యారు. ఈ మేరకు ఈ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య గురువారం హైదరాబాద్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నియామకపత్రం అందజేశారు. యువకులు బీసీ ఉద్యమంలో పాల్గొని బహుజన రాజ్యాధికారం సాధించాలని సూచించారు. జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, జెల్ల నరేందర్, వెంకటేశం, నందగోపాల్, ఉదయ్, రమేష్, యాదయ్య, సయ్యద్, వెంకన్న పాల్గొన్నారు.



ధనుంజయనేతకు నియామకపత్రం అందజేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

పీల్చేగాలి.. తాగేనీరు.. ఖరాబు

దేశంలో వాయు కాలుష్యంతో ఏటా 33 వేల మంది మృత్యువాత పడుతున్నట్లు జాతీయ గ్రీన్ ట్రైబ్యునల్ సంస్థ నివేదికలు ఇటీవల స్పష్టం చేస్తున్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ సంస్థల నివేదికలను సుమోటోగా తీసుకున్న ఎన్‌జీటీ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి ఈ నెల 21న నోటీసులు జారీ చేయటంతో పాటు వెంటనే కాలుష్యంపై విచారణ ప్రారంభించింది.

ఉమ్మడి జిల్లాలో 319 అనుమతి పొందిన భారీ, 84 మధ్యతరహా, 8,069 సాధారణ చిన్నతరహా పరిశ్రమలు ఉన్నాయి.71,687 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. రోజువారీ కూలీలు లక్ష మంది వరకు ఉన్నట్లు అంచనా.

2019లో ప్రభుత్వం జీవో 33తో 'జిల్లా స్థాయిలో గాలి నాణ్యత పర్యవేక్షణ కమిటీ'లను ఏర్పాటు చేసినా.. అవి కాగితాలకే పరిమితం కాగా.. ఆచరణలో కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రాంతంలో అత్యధికంగా కాలుష్యం వెలువరించే జిల్లాల్లో హైదరాబాద్ మహానగరం తర్వాత ఉమ్మడి నల్గొండ జిల్లా ప్రధానంగా ఉంది. ఇక్కడ రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోంది. సాధారణంగా కాలుష్య రేణువుల స్థాయి 2.5 మైక్రాన్లు ఉండాల్సి ఉండగా అంతకంటే 1.6 శాతం నల్గొండ జిల్లాలో ఎక్కువగా ఉన్నట్లు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గతంలో నివేదించింది. ఈ పరిస్థితిని చూస్తే పెరుగుతున్న పరిశ్రమలతో కాలుష్యం తీవ్రత సైతం అదే రీతిలో పెరుగుతోందని అర్థమవుతోంది.



మిర్యాలగూడలో పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థపు నీరు గుంతల్లో నిలిచిన తీరు

14 ఏళ్ల క్రితమే పీసీబీ ఆందోళన..

ఆసియా ఖండంలోనే అత్యధికంగా బియ్యం పరిశ్రమలు ఉమ్మడి జిల్లాలో ఉన్నాయి. 14 ఏళ్ల క్రితం రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి నీటి, వాయు కాలుష్యం తీవ్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ పరిశ్రమల నిర్వాహకులకు మూడు రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహించారు. పరిశ్రమల్లో వ్యర్థపు నీటిశుద్ధి ట్యాంకులు నిర్మించి నీటిని శుద్ధిచేసిన తరువాత బయటకు వదలాలని, మిల్లుల పొగగొట్టాలు 60 అడుగులకు మించి ఎత్తులో నిర్మించాలని ఆదేశించారు. బూడిద, పొట్టు గాలిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిమెంటు పరిశ్రమల కాలుష్యంతో గాలి, పరిసరాలు కాలుష్యం పెరిగిపోతుండగా సమస్య తీవ్రరూపం దాల్చుతుంది.



రైస్‌మిల్లుల నుంచి వచ్చే బూడిద గాంధీనగర్‌లోని ఇళ్లపై పడిన తీరు (పాత చిత్రం)

ముక్కుమూసుకుని వెళ్లాల్సిందే..

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై ప్రయాణించే వారికి దుర్వాసనలు వచ్చాయంటే చాలు చౌటుప్పల్ వచ్చినట్లుగా సంకేతం వస్తుంది. భరించలేని వాసనలు వెదజల్లే పరిశ్రమలు యాదాద్రి జిల్లాలో విస్తరించి ఉండగా వీటి కాలుష్యం వ్యర్థాలు ఒక్కోసారి రహస్యంగా తెచ్చి రహదారుల వెంట పోస్తున్నారు. జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులు ముక్కుమూసుకోకుండా వెళ్లలేని పరిస్థితి కాలుష్య తీవ్రతకు అద్దం పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో..

- చర్మ వ్యాధులతో బాధపడేవారు సుమారు 15,200 మంది
- ఊపిరితిత్తుల సమస్యలపై ఇబ్బంది పడేవారు సుమారు 18,020 మంది

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

మిర్యాలగూడ గ్రామీణం, న్యూస్‌టుడే: కౌలుకు పొలం చేసుకుని గౌరవంగా బతుకుతున్న ఓ పేదకుటుంబానికి చెందిన యజమానిని విద్యుదాఘాత రూపంలో మృత్యువు కబళించింది. భార్య కళ్ల ముందే విద్యుదాఘాతంతో భర్త విగతజీవిగా మారటంతో ఆమె రోదనలు మిన్నంటాయి. ఈ హృదయ విదారక ఘటన మండల పరిధిలోని రుద్రారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామీణ ఎస్సై లోకేష్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నల్లగంతుల యల్లయ్య(40) భార్య రేణుక మరో కూలి వెంకన్నతో కలిసి గురువారం పొలానికి నీలి మందు పిచికారీ చేయడానికి వెళ్లారు. అందులో భాగంగా నీటి కోసం యల్లయ్య బోరు మోటారు ఆన్ చేసే క్రమంలో కరెంటు షాక్‌కు గురయ్యారు. అది చూసిన వెంకన్న యల్లయ్యను పట్టుకోగానే ఆయనకు షాక్ కొట్టి దూరంగా పడ్డారు. భార్య రేణుక పెద్దగా కేకలు వేయటంతో పక్కనే ఉన్న కొందరు రైతులు విద్యుత్తు నియంత్రిక వద్ద సరఫరాను నిలిపేశారు. యల్లయ్యను వెంటనే పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా.. పరిశీలించిన డాక్టర్లు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య రేణుక, తల్లి సీతమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉండగా... పెద్ద కుమార్తెకు వివాహమైందని చెప్పారు.



యల్లయ్య

పురుగుమందు తాగి వ్యక్తి బలవన్మరణం

నాంపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగు మందు తాగి మృతి చెందిన ఘటనపై గురువారం నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎం.శోభన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గట్లమల్లేపల్లికి చెందిన మల్గిరెడ్డి సైదిరెడ్డి(36) దంపతులకు కుమార్తె(3) సంతానం. గత కొంతకాలంగా సైదిరెడ్డి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా, భార్య కూడా రెండేళ్లుగా మూర్ఛ వ్యాధితో ఇబ్బంది పడుతూ పుట్టింట్లోనే ఉంటోంది. భార్యభర్త ఇరువురు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటుండటంతో ఇటీవలే వీరి కుమార్తెను హైదరాబాద్‌లోని కీర్తనా ఫౌండేషన్ సంరక్షణలో ఉంచారు. కాగా తీవ్రమైన జబ్బుతో బాధపడుతున్న అతడు మంగళవారం వ్యవసాయ పొలం వద్ద పురుగు మందు తాగి బలవన్మరణం చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

సాగర్ నుంచి నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్ జలాశయానికి ఎగువ నుంచి భారీగా వరదనీరు వస్తుండడంతో ఎన్నెస్పీ అధికారులు మరోసారి గురువారం మధ్యాహ్నం నుంచి డ్యాం గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. రాత్రి 9 గంటల వరకు అందిన సమాచారం మేరకు శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 2,42,561 క్యూసెక్కులు వరద నీరు వస్తుండడంతో అధికారులు డ్యాం 24 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,92,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లతో పాటుగా కుడి, ఎడమకాల్వ, ప్రధాన విద్యుత్ కేంద్రం, ఎస్‌ఎల్బీసీ, వరద కాల్వ ద్వారా మొత్తం 2,42,561 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయనీటిమట్టం 590.00 అడుగులు కాగా.. 312.0450 టీఎంసీల వద్ద ఉంది.

తండ్రికి శాంతి చేస్తూ తనయుడి దుర్మరణం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: కొద్దిరోజుల క్రితం మరణించిన తండ్రికి శాంతి చేస్తుండగా.. తనయుడు కోనేరులో పడి మృతిచెందిన విషాద సంఘటన సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం పాతసూర్యాపేటలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాతసూర్యాపేటకు చెందిన పోలోజు రుక్మాచారి 25 రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు. అతనికి భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రుక్మాచారికి శాంతి చేసే కార్యక్రమంలో భాగంగా కుటుంబ సభ్యులు గురువారం గ్రామ సమీపంలోని చక్రయ్యగుట్టపైకి వెళ్లారు. అక్కడ కుమారుడు పోలోజు మహేష్‌చారి(22) శాంతి ప్రక్రియ పూర్తి చేసి గుట్టమీద ఉన్న కోనేరులో స్నానమాచరించేందుకు వెళ్లారు. కాలుజారి కోనేరులో పడిపోయి.. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయారు. ఆ సమయంలో కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టూ ఉన్నా రక్షించలేకపోయారు. కోనేరులోనే ఈత కొడుతున్న కొందరు బంధువులు అతన్ని కాపాడేందుకు ప్రయత్నించినా సాధ్యం కాలేదు. పరిసర ప్రాంత రైతులు వచ్చి మహేష్ మృతదేహాన్ని వెలికితీశారు.

★ బతుకుదెరువు కోసం పదిహేనేళ్ల క్రితం ఇదే జిల్లాలోని నూతనకల్ మండలం ఎర్రపహాడ్‌కు వెళ్లిన వీరి కుటుంబం తండ్రి అనారోగ్యం పాలవడంతో ఇటీవల పాతసూర్యాపేటకు వచ్చారు. నెల రోజుల వ్యవధిలో తండ్రి, కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. మృతుడి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ఆర్.శంకర్‌నాయక్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో.. ఆత్మహత్య

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామంలో ఉరేసుకొని ఒకరు మృతి చెందినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ తెలిపారు. సంస్థాన్‌నారాయణపురం మండలం జనగాం గ్రామానికి చెందిన సుక్క రాజు(36) డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్యతో కలిసి అత్తగారి ఊరు దండుమల్కాపురంలోనే నివాసం ఉంటున్నాడు. గత కొంత కాలం నుంచి భార్యతో రాజుకు తగాదాలు నడుస్తున్నాయి. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులు కూడా ఎక్కువ అవ్వడంతో ఇంట్లోనే ఉరేసుకొని చనిపోయాడు. గురువారం మధ్యాహ్నం స్థానికులు గమనించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.



సుక్క రాజు

నల్గొండ

•నల్గొండ •మునుగోడు •నకిరేకల్

ఉత్తమ ఉపాధ్యాయులుగా సేవలందించాలి

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: బీఈడీ ఉపాధ్యాయులు నైపుణ్యాలు పెంపొందించుకుని ఉత్తమ సేవలందించాలని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయ వీసీ అల్తాఫ్ హుస్సేన్ పేర్కొన్నారు. గురువారం ఎంజీయూలో పాఠ్యప్రణాళికలో మార్పుల అనుగుణంగా బోధన కోసం బీఈడీ అధ్యాపకులు అంశంపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్తమ ఉపాధ్యాయుల ద్వారా జాతి నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు. ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఓఎస్డీ కె.అంజిరెడ్డి, ఓయూ ప్రొఫెసర్లు శంకర్, సునిత, లలిత, దుర్గేషం, జయంతి, సరిత పాల్గొన్నారు.

26న 'స్నేహ పరిమళం' సంచిక ఆవిష్కరణ

చిట్యాల, న్యూస్‌టుడే: ఇటీవల అనారోగ్యంతో మరణించిన తెలంగాణ గ్రామ నామాల పరిశోధకుడు, ప్రభుత్వ తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ మండల స్వామి సంస్మరణార్థం ఆయన సాహితీమిత్రులు రాసిన కవితలు, అభిప్రాయాలతోకూడిన సంస్మరణ సంచిక 'స్నేహ పరిమళం'ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఈనెల 26న నల్గొండలోని యూటీఎఫ్ భవన్లో సాయంత్రం ఆవిష్కరించనున్నారని సృజనసాహితీ సంస్థ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్, కార్యదర్శులు డాక్టర్ సాగర్ల సత్తయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాహితీవేత్తలు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డాక్టర్ తండు కృష్ణకౌండిన్య హాజరు కానున్నారని వారు తెలిపారు.

సర్వోన్నత న్యాయస్థానం తీర్పు హర్షణీయం

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: బాల్య వివాహాల నిషేధంపై సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఆశ్రిత సంస్థ డైరెక్టర్ నాగరాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలు కలిసి బాల్య వివాహాల నిషేధంపై మరింత అవగాహన కల్పించాలన్నారు. సంస్థ సమన్వయకర్త పర్వతాలు, మేనేజర్ వెంకటేశ్, మల్లేశ్, స్వప్న, సునీత, శోభారాణి పాల్గొన్నారు.



సర్వోన్నత న్యాయస్థాన తీర్పు ప్రతులను విడుదల చేస్తున్న ఆశ్రిత సంస్థ సభ్యులు

ఇళ్లపైన ఇలా.. ప్రాణాలు ఎలా..!



నకిరేకల్: ఎస్ఎల్‌బీసీ కాలనీలో ఇళ్లపై నుంచి వెళుతున్న 33కేవీ విద్యుత్ లైను



శాలిగౌరారంలో ఇళ్లపైన ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

నకిరేకల్, న్యూస్‌టుడే: ఇళ్ల మీద నుంచి వెళ్తున్న ఎల్‌టీ, 11 కేవీ, 33 కేవీ తీగలు ప్రమాదాలను తెచ్చిపెడుతున్నాయి. నకిరేకల్ పురపాలిక పరిధిలోని ఎస్ఎల్‌బీసీ కాలనీ నుంచి మూసీ రోడ్డు శాంతినగర్ కాలనీ వరకు వంద ఇళ్లమీద నుంచి హైటెన్షన్ విద్యుత్ ప్రసారమయ్యే 33కేవీ లైను వెళ్లింది. ఈ గృహాల వారు ఇళ్లపైకి ఎక్కాలంటేనే భయపడి పోతున్నారు. ఏమరుపాటుతో వెళ్తే ప్రమాదాలకు గురవుతున్నారు. హైటెన్షన్ ప్రసారదాటికి ఇళ్లలోని విద్యుత్ గృహోపకరణాలు తరచూ కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శాంతినగర్‌లో ఈ లైన్ ఇనుప స్తంభాలను తాకిన గొర్రెలు గతంలో మృత్యువాత పడ్డాయి. కాటమయ్య బజార్‌లో విద్యుత్ శాఖ లైన్‌మెన్ ఇంటి మీద 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదంగా వేలాడుతున్నాయి. లైన్‌మెన్ కుటుంబీకులు ఇటీవల ఇంటిపై దుస్తులు ఆరవేసేందుకు వెళ్లి విద్యుదాఘాత ప్రమాదానికి గురై ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

శాలిగౌరారం, న్యూస్‌టుడే: శాలిగౌరారంలో 11కేవీ- 133 కేవీలు నివాస గృహాలు, రోడ్డు పక్క నుంచి ఏర్పాటు చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బయటికి వెళ్లాలంటేనే దుకాణదారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఓ పక్క 133 కే.వీ లైను మరో పక్క 11కేవీ లైన్‌తో పాటు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలతో ప్రయాణికులు, ప్రజలు, దుకాణదారులకు ప్రమాదం పొంచి ఉంది. 33 కేవీ విద్యుత్ లైన్ ఇళ్లపై వెళ్లిన కారణంగా విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి చెందగా, మరో ముగ్గురు ఆసుపత్రి పాలై రూ.లక్షలు వెచ్చించి త్రుటిలో ప్రాణాలతో బయట పడ్డారు.

సమస్యను పరిష్కరిస్తాం

-శ్రీధర్, ఏఈ ట్రాన్స్‌కో, శాలిగౌరారం

సమస్య మా దృష్టికి వచ్చింది. ఇళ్లపై దుకాణాలపై ఉన్న విద్యుత్ తీగలను స్తంభాలను తొలగించాలని దుకాణదారులు, యజమానులు కోరారు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. నిధులు రాలేదు. మంజూరైన వెంటనే సమస్యను పరిష్కరిస్తాం.

మునుగోడు, న్యూస్‌టుడే:

? గూడపూర్ నుంచి కొరటికల్ గ్రామానికి వెళ్లే మార్గంలో కంపచెట్లు కమ్మేశాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు.
- శ్రీశైలం, కొరటికల్

✔ సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటాం.
-స్వరూపరాణి, ఎంపీడీవో, మునుగోడు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 52710, 80085 66199 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. శుభ్రం చేయించాలి. -చారి, నల్గొండ.

✔ శుభ్రం చేయిస్తాం. వ్యర్థాలు రోడ్లపై పారబోయకుండా పుర వాహనాలకు అందించాలి
-శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక.



తేమ శాతం పరిశీలిస్తున్న డీసీవో వెంకటేశ్వర్లు

కొనుగోలు కేంద్రం సందర్శన

కనగల్, న్యూస్‌టుడే: పర్వతగిరి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీవో వెంకటేశ్వర్లు గురువారం సందర్శించారు. ధాన్యాన్ని కాంటా వేసి అదే రోజు కనగల్ మార్కెట్ యార్డు గోదాములకు పంపించాలన్నారు. సన్నధాన్యం పండించిన రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌తో పాటు మద్దతు ధర రూ.2,320 పొందాలన్నారు. ఏపీఎం హరి, డీటీ జ్యోత్స్న, సీసీ వసంత, శివ పాల్గొన్నారు.

గట్టుప్పల, చండూరు: గట్టుప్పల, చండూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చండూర్ రైతు సేవా సహకార సంఘం వైస్ చైర్మన్ కోడి సుష్మ గురువారం ప్రారంభించారు. రైతులకు మార్కెట్‌లో అన్ని వసతులను కల్పిస్తామన్నారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్లు కరుణ రాములు, దశరథ, డైరెక్టర్లు అంజనేయులు, శ్రీను, గోసికొండ, నాగార్జున, భిక్షం, శ్రీనివాస్, రాజు, నర్సింహ పాల్గొన్నారు.

29న ధర్మయుద్ధ మహాసభ

చిట్యాల, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణను అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 29న హైదరాబాద్‌లో జేఎన్ఎం గార్డెన్స్‌లో ఉమ్మడి నల్గొండ జిల్లాస్థాయి ధర్మయుద్ధ మహాసభను నిర్వహించనున్నామని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ పేర్కొన్నారు. చిట్యాలలో గురువారం జరిగిన నకిరేకల్ నియోజకవర్గస్థాయి ముఖ్య నాయకుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. ఎంఎస్పీ నియోజకవర్గ బాధ్యుడు మేడి శంకర్, గోవర్ధన్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత శివశంకర్, పురుషోత్తం, మల్లయ్య, స్వామి, కిరణ్, శ్రీను పాల్గొన్నారు.



చిట్యాలలో మాట్లాడుతున్న ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్

ఐక్యరాజ్య సమితి దినోత్సవం

నకిరేకల్, న్యూస్‌టుడే: ప్రపంచ దేశాల మధ్య శాంతి సామరస్యాలను కాపాడుతూ, సుస్థిరాభివృద్ధి కోసం పాటుపడే గురుతర బాధ్యత ఐక్యరాజ్య సమితిదని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.బెల్లి యాదయ్య చెప్పారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఐక్యరాజ్య సమితి ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకుడు జి.మధుసూదన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నాగు, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్, హరిత, శంకర్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



నకిరేకల్: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ డా.బెల్లి యాదయ్య, రాజనీతిశాస్త్ర అధ్యాపకుడు మధుసూదన్‌రెడ్డి

కాలుష్యం నుంచి మూసీని కాపాడండి

చిట్యాల, న్యూస్‌టుడే: పరిశ్రమల నుంచి వచ్చి కలుస్తున్న వ్యర్థ రసాయనాలు, ఇతరత్రా కారణాలతో కాలుష్యం అవుతున్న మూసీనదిని కాపాడాల్సిన బాధ్యత పాలకులపై ఉందని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ డిమాండ్ చేశారు. చిట్యాలలో గురువారం జరిగిన పార్టీ మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మూసీలోకి హైదరాబాద్‌తోపాటు రంగారెడ్డి, నల్గొండ జిల్లాలోని పలు పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ రసాయనాలు వదలడం వల్ల నీరు కలుషితమై, దానితో పండించిన పంటలపై ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. మండల కార్యదర్శి ఎం.డి అక్బర్, బొడిగె సైదులు, సత్యం, లింగయ్య, బాలరాజు, సత్తయ్య, చిన్న వెంకన్న, నరసింహ పాల్గొన్నారు.



చిట్యాలలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సదస్సు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం జంతుశాస్త్ర విభాగం, లియోక్లబ్, ఎంఎస్ఎఫ్ లయన్స్ క్లబ్ నల్గొండ ఆధ్వర్యంలో స్త్రీల ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రముఖ వైద్యులు గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, వ్యాక్సినేషన్, ఎనిమియా, వ్యక్తిగత పరిశుభ్రత, స్త్రీలలో వచ్చే పలు గైనిక్ సమస్యలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రావు, మంజుల, డా.హరినాథ్, డా.సుచరిత, డా.లావణ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి

నకిరేకల్, న్యూస్‌టుడే: కార్తిక మాసంలో పంచరామాల దర్శనం కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా నడిపే బస్సుల సేవలను భక్తులు వినియోగించుకోవాలని సూర్యాపేట డిపో మేనేజర్ సురేంద్ర కోరారు. నకిరేకల్ ఐశ్వర్యసాయి మందిరంలో పంచరామాల యాత్ర వివరాలను తెలిపే ఫ్లెక్సీని గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి పౌర్ణమికి అరుణాచలంలో దర్శనం కోసం సూర్యాపేట డిపో నుంచి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. డిపో సహాయ మేనేజర్ బి.సైదులు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆర్వీ సింగ్, కంట్రోలర్ మన్సూర్, మధుసూదన్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

మునుగోడు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతం సంభవించి పూరి గుడిసె దగ్ధమైన ఘటన మునుగోడు మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీదేవిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్గి శేఖర్‌కు చెందిన పూరి గుడిసెకు విద్యుదాఘాతం సంభవించి ఇంట్లో ఉన్న సామగ్రికి అంటుకొని మంటలు వ్యాపించాయి. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ నరేందర్, ఆర్ఐ నాగరాజులతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించి పంచనామా నిర్వహించారు. 50 కేజీల బియ్యం అందజేశారు.

ప్రతిభా పరీక్షల్లో ఎస్‌పీఆర్ విద్యార్థుల ప్రతిభ

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: శ్రీనివాస్ రామానుజన్ టాలెంట్ టెస్ట్ పరీక్ష ఫలితాల్లో నల్గొండలోని ఎస్‌పీఆర్ ఉన్నత పాఠశాల చెందిన 26 మంది రెండో దశకు అర్హత సాధించారు. సెప్టెంబరు 15న జరిగిన ఈ పరీక్షలో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి రెండో దశకు అర్హత సాధించినట్లు పాఠశాల చైర్మన్ బైరెడ్డి హిమవంతరెడ్డి, కరస్పాండెంట్ నన్నూరి రావిరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ కొలిచి వరప్రసాద్ తెలిపారు.



శ్రీనివాసరామానుజన్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చాటిన ఎస్‌పీఆర్ పాఠశాల విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

నూతన విద్యా విధానం రద్దుకు డిమాండ్

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యుడు నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. కేంద్రం తీసుకువచ్చిన ఈ విధానం వల్ల ఎన్నో నష్టాలు ఉన్నాయని వివరించారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతీసే విధంగా ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అంజనేయులు, మురళీకృష్ణ, శోభన్ పాల్గొన్నారు.

కేసులు నమోదు

కట్టంగూరు, న్యూస్‌టుడే: పామనగుండ్ల పెట్రోల్ బంక్‌లో సిబ్బందికి, వినియోగదారునికి మధ్య జరిగిన వివాదానికి సంబంధించి ఇరువురి నుంచి ఫిర్యాదులు అందడంతో కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. కారులో 42 లీటర్ల పెట్రోల్ నింపిన అనంతరం డబ్బులు ఇవ్వకుండా కారు పెట్రోల్ ట్యాంక్ సామర్థ్యం 35 లీటర్లే అంటూ శరత్‌కుమార్ అనే వ్యక్తి సిబ్బందితో గొడవకు దిగాడని బంక్ సూపర్‌వైజర్ జి.జానయ్య ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఎస్సై రవీందర్ తెలిపారు.

✦ పెట్రోల్ విషయంలో తనకు జరిగిన మోసంపై బంక్ యజమానికి చరవాణిలో ఫిర్యాదు చేసిన ఫలితంగా సిబ్బంది తనను దూషించి బెదిరించారని నార్కట్‌పల్లి మండలానికి చెందిన శరత్‌కుమార్ ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడంతో బంక్ సిబ్బందిపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై వివరించారు. ఇదిలా ఉండగా పెట్రోల్‌బంకును జిల్లా తూనికలు, కొలతలశాఖ అధికారి పి.రామకృష్ణ తనిఖీ చేశారు. డీటీ ఆర్.జ్యోతి పాల్గొన్నారు.

గాదరి తక్షణమే క్షమాపణలు చెప్పాలి

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని విమర్శించే నైతిక హక్కు భారాస మాజీ ఎమ్మెల్యేలకు లేదని డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ అన్నారు. మంత్రి కోమటిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. గురువారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంకర్‌నాయక్ మాట్లాడారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేసిన అనుభవంతో అభివృద్ధి పనులు చేస్తుంటే తట్టుకోలేక విమర్శలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, లక్ష్మయ్య, కత్తుల కోటి, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి

కనగల్: గాదరి కిషోర్‌కుమార్ తక్షణమే మంత్రికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూ ఎన్సెస్ఐ ఆధ్వర్యంలో కనగల్ క్రాస్ రోడ్డు వద్ద ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎన్సెస్ఐ అధ్యక్షుడు రాజా, మహేందర్, అశోక్, స్వామి పాల్గొన్నారు.

శాలిగౌరారం: గాదరి కిశోర్‌కుమార్ వ్యాఖ్యలకు నిరసనగా మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కండల సమరసరెడ్డి ఆధ్వర్యంలో శాలిగౌరారం అంబేడ్కర్ ప్రధాన చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, ధనుంజయ్య, జనార్దన్, పరమేష్, వెంకటయ్య, నర్సింహ, అశోక్, శ్రీను పాల్గొన్నారు.

నకిరేకల్: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డిలపై గాదరి కిశోర్‌కుమార్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని టీపీసీసీ పూర్వ కార్యదర్శి చెవ్వ రవీందర్ చెప్పారు. నకిరేకల్‌లో విలేకరుల సమావేశంలో గురువారం మాట్లాడారు. జి.రవీందర్‌రెడ్డి, ఎం.డి యూసుఫ్, సీహెచ్.రాజశేఖర్, వి.నక్షత్ర, మహేశ్, సతీశ్ పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని గాదరి కిశోర్ క్షమాపణ చెప్పాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్లెంల సైదులు డిమాండ్ చేశారు. మాడ్గులపల్లిలో ఆయన మాట్లాడారు.

అర్హత లేనివారిపై చర్యలు తీసుకోవాలని వినతి

నల్గొండ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో అర్హత లేని వారు ఫిజియోథెరపీ క్లినిక్‌లు పెట్టడంతో పాటు ఇంటి వద్దే బాధితులకు వైద్య సేవలు చేస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ నల్గొండ ఫిజియోథెరపిస్ట్‌ల సంఘం నాయకులు గురువారం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అర్హత లేనివారు థెరపీ చేయడం వల్ల బాధితులకు కొత్త సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. స్పందించిన కలెక్టర్ డీఎంహెచ్‌వో మాట్లాడి తనిఖీలు నిర్వహించి అనర్హులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. డా.సైదయ్య, యాదయ్య, నాగరాజు, సత్యవాణి, అనుష, శ్రీవాణి, ప్రియాంక పాల్గొన్నారు.



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఫిజియో థెరపీ సంఘం నాయకులు

నాణ్యమైన విద్య అందించాలి: డీఈవో

నకిరేకల్, న్యూస్‌టుడే: ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని డీఈవో బి.భిక్షపతి సూచించారు. మండలంలోని చందుపట్ల జడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం తనిఖీచేసి మాట్లాడారు. తల్లిదండ్రులకు నమ్మకం కలిగించే విధంగా బోధన చేస్తూ వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని, ప్రతి విద్యార్థిపై శ్రద్ధ చూపాలన్నారు. పాఠశాల హెచ్ఎం నర్సింహ పాల్గొన్నారు.



నకిరేకల్: చందుపట్ల జడ్పీ పాఠశాలలో విద్యార్థుల మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీఈవో బి.భిక్షపతి

ఆదర్శ పురపాలికగా చేయడమే లక్ష్యం

నకిరేకల్, న్యూస్‌టుడే: వార్డుల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణతో కృషిచేస్తామని నకిరేకల్ పురపాలిక వైస్‌ఛైర్పర్సన్ చౌగోని రజిత చెప్పారు. పుర పరిధిలోని 15వ వార్డులో గురువారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆదర్శ పురపాలికగా నకిరేకల్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. కౌన్సిలర్ యాసారపు లక్ష్మి, నాయకుడు వెంకన్న పాల్గొన్నారు.



నకిరేకల్: పుర 15వ వార్డులో వీధిదీపాల ఏర్పాటు పనులు పరిశీలిస్తున్న పుర వైస్‌ఛైర్పర్సన్ రజిత, కౌన్సిలర్ లక్ష్మి

స్నేహితురాలి కుటుంబానికి చేయూత

శాలిగౌరారం, న్యూస్‌టుడే: మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన స్వాతి భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న 2005-06 పదో తరగతి పూర్వవిద్యార్థులు ఆర్థికంగా ఆదుకొని చేయూతనందించారు. అంతా కలిసి రూ.30వేలు పోగు చేసి స్వాతికి అందజేశారు. బస్వరాజు, అనిల్, సత్యనారాయణ, శ్రీను, ఉపేందర్, శేఖర్, లింగయ్య, వెంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

అవీ ఇవీ

27న రైతుల ఆత్మీయ సమ్మేళనం .. శాలిగౌరారం: మూసీ నది పునరుజ్జీవనం కోసం ఈనెల 27న మానాయకుంటలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కందాల సమరసరెడ్డి కోరారు. స్థానిక సీపీఎం ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్, జనార్దన్, చైతన్య, నర్సింహ, రవి, రవి, విజయ్, పరమేష్ పాల్గొన్నారు.

ఎంజీయూ బ్యాడ్మింటన్ జట్టును అభినందించిన వీసీ .. నల్గొండ క్రీడావిభాగం: తమిళనాడు రాష్ట్రంలో ఈనెల 26 నుంచి నిర్వహించే అంతర్ విశ్వవిద్యాలయాల బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం క్రీడా జట్టు సభ్యులను గురువారం వీసీ అల్తాఫ్ హుస్సేన్ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. ఎంజీయూ స్పోర్ట్స్‌బోర్డు కార్యదర్శి హరీశ్‌కుమార్, జట్టు మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, కోచ్ నాగార్జున పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.. చిట్యాల: సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అవశెట్టి మహేశ్ డిమాండ్ చేశారు. వెలిమినేడులో గురువారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కనీస మద్దతు ధరను రూ.10వేలుగా ప్రకటించాలన్నారు. మండల కమిటీ సభ్యులు వెలికంటి నరసింహ, గ్రామశాఖ కార్యదర్శులు నరేశ్, వెంకట్రామయ్య, దుర్గయ్య, మోహన్‌రెడ్డి, నరసింహ, రమేశ్ పాల్గొన్నారు.

అనాథకు అంత్యక్రియలు.. నీలగిరి: శాంతి మహిళా మండలి అనాథ ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న హేమలత (28) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ మేరకు తామే అంత్యక్రియలు నిర్వహించామని నిర్వాహకురాలు పిచ్చమ్మ తెలిపారు. మహబూబ్‌నగర్‌కు చెందిన హేమలత తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆమెను ఎనిమిదేళ్ల క్రితం ఇక్కడ చేర్పించారని వివరించారు. బంధువులు, తోబుట్టువులు ఎవరూ రాకపోవడంతో తామే అన్నీ కార్యక్రమాలు నిర్వహించామన్నారు.



సభ్యత్వాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

ప్రతి బూత్‌లో భాజపా సభ్యులుండాలి

నీలగిరి, న్యూస్‌టుడే: ప్రతి బూత్‌లో భాజపా సభ్యులు ఉండేలా సభ్యత్వ నమోదు చేయించాలని మాజీ ఎమ్మెల్యే ధర్మారావు సూచించారు. గురువారం నల్గొండ పట్టణంలోని పలు కాలనీల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, సాంబయ్య, లింగస్వామి, విద్యాసాగర్‌రెడ్డి, అనిల్‌కుమార్, ప్రమోద్, నాగరాజు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

నల్గొండ గ్రామీణం: మండలంలోని కొత్తపల్లి, చెన్నారంలో గురువారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. మన్నెం మాజీ శాసనసభ్యులు ధర్మారావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం

గట్టుప్పల, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. గట్టుప్పల మండల కేంద్రంలో మహాసభ ప్రారంభ సూచికగా సీనియర్ నాయకుడు రబ్బానీ జెండావిష్కరణ చేశారు. మండల మహాసభ చాపల మారయ్య అధ్యక్షతన జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి కోరారు. సీపీఎం మండల కార్యదర్శి బండ శ్రీశైలం, కట్ట నర్సింహ, చంద్రమౌళి, మల్లేశం, దనంజయ్య, సుధాకర్, నర్సింహ పాల్గొన్నారు.



మండల కేంద్రంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

IN THE COURT OF THE JUDGE FAMILY COURT CUM III ADDL. DISTRICT JUDGE AT NALGONDA
G.W.O.P.NO.19 OF 2024

Between:
Kothmeerkhar Rakesh ...Petitioner
And
1.Mendikar Nagesh
2.Whomsoever it may concern ...Respondents

To
Whomsoever it may concern

NOTICE

General public is hereby informed that the above named petitioner filed a case for custody of minor children by name 1. Master Kothmeerkhar Manoj and 2. Baby Kothmeerkhar Sheshi Jahnavi. The said case is stands posted to 13-11-2024 for the appearance if anyone is interested in the above matter he/she may appear personally or through an advocate before the Hon'ble Court on 13-11-2024 at 10-30 a.m. and submit their case.
Hence this notice.

// BY THE ORDER OF THE COURT//

K.RAVI KANTH, ADVOCATE, HYDERABAD
MD.NIZAMUDDIN, ADVOCATE, NALGONDA
M.SATYA SAI BABA, ADVOCATE, NALGONDA

సినిమాలు నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: నటరాజ్: దేవర, తిరుమల: పగులు-లగ్గం, రాత్రి-వెనమ్, వెంకటేశ్వర: పొట్టేలు
నకిరేకల్: రామకృష్ణ- విశ్వం, వెంకటేశ్వర- దేవర

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

'హెరిటేజ్' ఆధ్వర్యంలో అవగాహన

నిడమనూరు, న్యూస్‌టుడే: 'హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్, నిడమనూరు పాల శీతలీకరణ కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని తుమ్మడంలో పాడిరైతులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జోనల్‌హెడ్ సత్యనారాయణ మాట్లాడుతూ.. పాడి రైతులు పాల దిగుబడి పెంచుకోవడానికి సూచనలు, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రీజినల్‌హెడ్ వరప్రసాద్, ప్రాంతీయ మేనేజర్ జితేశ్వర్ రెడ్డి, డైరీ బ్రాంచి మేనేజర్ ఎండీ.హఫీజుల్లా ఖాన్, పాడి రైతులు పాల్గొన్నారు.


పాడిరైతులతో మాట్లాడుతున్న హెరిటేజ్ డైరీ అధికారులు

దరఖాస్తుల స్వీకరణ

డిండి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల వసతి గృహం నైట్ వాచ్‌మెన్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో గోప్యానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29 వరకు దరఖాస్తులను ఎంఆర్‌సీ కార్యాలయంలో అందించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని పొబుగనగర్‌లో పక్క కాల్వల్లో వ్యర్థాలు తొలగించకపోవడంతో దోమలు, దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం: – సురేష్, మిర్యాలగూడ

✔ పక్క కాల్వల్లో వ్యర్థాలు తరలించేందుకు చర్యలు తీసుకుంటాం: – ఎండీ.యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ

భక్తిశ్రద్ధలతో శ్రీఅనఘాష్టమి వ్రతాలు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: రైల్వేకాలనీ శ్రీసాయిదత్త ఆశ్రమం దత్త మందిరంలో గురువారం శ్రీ అనఘాష్టమి వ్రతములను సామూహికంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు గుండా శ్రీనివాస్ జ్యోతి వెలిగించి వ్రతములు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రకాష్, గుడుగుంట్ల నరేందర్, మట్టయ్య, సోమన్న, జానకిరాములు, జగన్నాధరావు, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు. పట్టణం పరిసర ప్రాంతాల నుంచి దంపతులు వ్రతాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

పెగ్గుమీరుతున్న యువత



దేవరకొండ, న్యూస్‌టుడే: యుక్త వయస్సు.. సినిమాలు.. సోషల్ మీడియా ప్రభావం.. మద్యం, గంజాయి మత్తులో దేవరకొండలో యువత పెడదారి పడుతోంది. ఇటీవల తమ పెద్దరికాన్ని చాటుకునేందుకు తాపత్రయపడుతూ అర్ధరాత్రి వేళ గొడవలకు పాల్పడుతున్నారు. మత్తు ప్రభావంతో ఏం చేస్తున్నారో తెలియక ఇరువర్గాలు ఘర్షణలు పడుతుండడంతో వీధుల్లోని జనం బెంబేలెత్తుతున్నారు. చదువుకోవాల్సిన ఈడులో హీరోయిజాన్ని ప్రదర్శించాలని గ్యాంగుల్లో చేరిపోతున్నారు. మత్తు వ్యసనాల బారినపడి దారి తప్పుతున్నప్పటికీ తల్లిదండ్రులు పట్టించుకోకపోవటంతో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు గమనించాల్సిన కన్నవారు తమ వ్యాపకాల్లో నిమగ్నమై ఉండడం, వారి పెంపకంపై అవగాహన లోపించడంతో ఇష్టాను సారంగా వ్యవహరిస్తూ వీధి పోరాటాలకు కాలు దువ్వుతున్నారు. పోలీసు యంత్రాంగం గ్యాంగ్‌వార్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సహించేది లేదు: నర్సింహులు, సీఐ



రౌడీయిజం, వ్యాపారులను బెదిరించడం, గ్యాంగులతో ఘర్షణ పడడం వంటి సంఘటనలను సహించేది లేదు. ఘర్షణకు పాల్పడిన వారికి ఇప్పటికే కౌన్సిలింగ్ ఇచ్చి రిమాండ్‌కు పంపాం.

దేవరకొండలో గ్యాంగ్‌వార్లు.. బెంబేలెత్తుతున్న జనం



★ ఇటీవల దేవరకొండ పట్టణంలోని సంతోషిమాతకాలనీలో రెండు యువ గ్యాంగులు హోరాహోరీగా దాడులు చేసుకున్నాయి. బీరు సీసాలతో పొడుచుకోవడంతో తీవ్ర గాయాలై హైదరాబాద్ తరలించారు. ఈ రెండు గ్యాంగులు ఆధిపత్యం కోసం(భాయ్ హోదా) దాడులు చేసుకుంటూ పట్టణంలో భయాందోళన సృష్టిస్తున్నాయి. ఈ ఘటనలో 11 మందిని పోలీసులు రిమాండ్ చేశారు.

★ రెండు నెలల క్రితం దేవరకొండ పట్టణంలోని మహబూబ్‌నగర్ రోడ్డులో ఉన్న వైన్స్‌షాప్ వద్ద మద్యం తాగించలేదనే సాకుతో చేతిలో కర్రలు పట్టుకొని వీరంగం సృష్టించారు. సినీ ఫక్కీ తరహాలో చోటుచేసుకున్న ఈ ఘటనతో కోదాడ-జడ్చర్ల జాతీయ రహదారిపై వెళ్లే ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అర్ధరాత్రివేళ కేకులు కట్ చేసుకొని డీజేలతో స్థానికులకు నిద్ర పట్టకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు.

కళాశాల ఎదుట వ్యర్థాల తొలగింపు

స్పందనకు వందనం

చింతపల్లి, న్యూస్‌టుడే: మండల కేంద్రం నుంచి వర్కాల గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల రోడ్డు పక్కన వ్యాపారస్తులు నిత్యం వ్యర్థాలు, చెత్తా చెదారాన్ని విచ్చలవిడిగా వదిలేస్తున్నారు. దీంతో పందులు, కుక్కలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా స్వైరవిహారం చేస్తున్నాయి. దీనిపై ఈనెల 22న 'ఈనాడు'లో 'వ్యర్థాల.. పట్టించుకోని అధికారులు' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు గ్రామంలోని పొక్లెయిన్ సాయంతో చెత్తను ట్రాక్టర్‌లో డంపింగ్ కేంద్రానికి తరలించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్య జీవనం

మిర్యాలగూడ, మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నేటి ఆధునిక ఒత్తిడితో కూడిన పరిస్థితుల్లో యోగాతో సంపూర్ణ ఆరోగ్యవంతమైన జీవనం సాగించవచ్చని యోగ గురూజీ వీరబ్రహ్మం ఆచారి తెలిపారు. పట్టణంలోని మేరెడ్డి రామచంద్రారెడ్డి స్మారక గ్రంథాలయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోజుకు రెండు గంటల సమయం ఆరోగ్యం కోసం కేటాయించాలని యోగ సాధనతో ఆనందమయమైన జీవనం సాగించవచ్చన్నారు. కార్యక్రమంలో సైదయ్య, పంతులు నాయక్, కోలా సైదులు, వెంకన్న, నాగభూషణం, సురేష్, నాగేశ్వర్రావు , శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడలో యోగా శిక్షకుడు వెంకటేశ్వర్లు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న సాధకులు

అక్రమార్కులపై చర్యలకు నిరసన

వేములపల్లి న్యూస్‌టుడే: మండల పరిధిలోని రావువారిగూడెంలో ప్రభుత్వ పాఠశాల స్థలాన్ని, చెరువు అలుగును కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు పాఠశాల ఆవరణలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ.. 50 ఏళ్ల కిందట గ్రామానికి చెందిన దాత మాలి అమృతరెడ్డి సర్వే నెంబరు 83లో పాఠశాల భవనం కోసం కొంత స్థలాన్ని దానంగా ఇచ్చారు. ఇటీవల ఇదే సర్వే నెంబరులో భూమిని కొనుగోలు చేసిన ఓ నాయకుడు పాఠశాల భవనం కోసం దాత ఇచ్చిన స్థలాన్ని కబ్జా చేశారని వారు ఆరోపించారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు, ప్రజాప్రతినిధులకు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి కబ్జాకు స్థలాల్ని కాపాడి తిరిగి పాఠశాలకు, గ్రామపంచాయతీకి అప్పగించాలని కోరారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటాం: ఎమ్మెల్యే బత్తుల

మాడ్గులపల్లి, న్యూస్‌టుడే: వర్షాలతో పంట నష్టపోయిన రైతుల బాధలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. మాడ్గులపల్లి మండలంలోని పాములపహాడ్, భీమనపల్లి, ఆగామోత్కూర్, చిరుమర్తి గ్రామాల్లో వర్షాల కారణంగా నేలవాలిన పంటలను గురువారం ఆయన పరిశీలించారు. వర్షాలతో వరిపైరు నేలవాలటంతో అక్కడి నుంచి వీడియోకాల్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. నష్టపోయిన వారి వివరాలను సేకరించాలని వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు. ఏడీఏ దేవ్‌సింగ్, ఏవోలు శివరామ్‌కుమార్, సైదానాయక్ పాల్గొన్నారు.


పాములపహాడ్‌లో వర్షానికి రాలిన వరిగింజలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

వేములపల్లి: మండల పరిధిలోని ఆమనగల్ రావువారిగూడెంలో అకాల వర్షాల కారణంగా నేలవాలిన పొలాలను ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన జిల్లా కలెక్టర్‌కి వీడియో కాల్ ద్వారా పంట నష్టాన్ని చూపించి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం చెల్లించే విధంగా చూడాలన్నారు.

పరామర్శ.. మిర్యాలగూడ గ్రామీణం: మండల పరిధిలోని అవంతీపురం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ పోడిశెట్టి నాగయ్య మృతి విషయం తెలుసుకున్న శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి గురువారం గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహాన్ని సందర్శించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఖర్చుల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు రూ.లక్ష నగదు అందజేశారు. ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ నల్లమోతు సిద్ధార్థ రూ.25 వేలు, రైసస జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి పరామర్శించి రూ.10వేలు, గ్రామీణ ఎస్సై పి.లోకేష్ రూ.5వేలు నగదు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, పలువురు పరామర్శించారు.

భాజపా సభ్యత్వ నమోదుకు స్పందన

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి యువత విశేష స్పందన కనబరుస్తూ సభ్యత్వాలు పొందుతున్నారని ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం మదన్‌మోహన్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్ 34, 35 వార్డుల్లో గురువారం ఇంటింటి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళిత మోర్చా జిల్లా కార్యదర్శి ఉబ్బపల్లి నాగరాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరాజు శివ, సోములు, గిరి, రాజిరెడ్డి, నాగార్జున్, మహేష్, రాజు, సైదులు, ప్రసాద్ పాల్గొన్నారు.

మేకల దొంగ అరెస్టు, రిమాండు

గుర్రంపోడు, న్యూస్‌టుడే: రోడ్డు వెంట వెళ్తున్న మేకను అమాంతం తమ వాహనంలో వేసుకొని తస్కరించిన ముగ్గురు దొంగలపై గుర్రంపోడు పోలీసులు కేసు నమోదు చేసి రిమాండుకు తరలించారు. మిర్యాలగూడ మండలం తుంగపాడు గ్రామానికి చెందిన కొమ్రాజుల శేఖర్, కొమ్రాజుల శివయ్య, సంపంగి పార్థు అనే వ్యక్తులు శ్రీశైలం వెళ్లి బుధవారం సాయంత్రం తిరిగి వస్తూ తానేదార్‌పల్లి సమీపంలో రోడ్డు వెంట వెళ్తున్న జీవాల మందలో వెనుకబడిన చివరి మేకను అమాంతం పట్టుకుని తమ వాహనంలో వేసుకొని వెళుతుండగా.. చుట్టుపక్కల వారు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. గురువారం బాధితురాలు మహంకాళి పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండుకు పంపినట్లు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఓంకార్ ఆశయాలు సాధిద్దాం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: నీతి, నిజాయితీలకు నిలువెత్తు రూపం.. సాయుధ పోరాట యోధుడు మద్దికాయల ఓంకార్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎంసీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్య అన్నారు. ఓంకార్ వర్ధంతి సందర్భంగా గురువారం మిర్యాలగూడలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. సైదమ్మ, కాశీ, మోహన్‌నాయక్, జ్యోతి, కిరణ్, భరత్, ఆశీర్వాదం, చంద్రకళ, వీరయ్య, ఉప్పలమ్మ, రవి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలో ఓంకార్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎంసీపీఐ నాయకులు

నల్లబెల్లం పట్టివేత

తిరుమలగిరి సాగర్, న్యూస్‌టుడే: మండలంలోని జమ్మనకోటతండాలో సుమారు రూ.3 లక్షల విలువైన బెల్లం, ఆలం, నాటుసారా ఉన్నట్లు అందిన సమాచారం మేరకు హైదారాబాద్‌కు చెందిన ఎస్టీఎఫ్ టీం లీడర్ ఎస్ఐ బాలరాజు సిబ్బందితో కలిసి గురువారం తనిఖీలు చేసి పట్టుకున్నారు. ఏపీలోని గుంటూరు, మాచర్లకు.. తండాకు చెందిన కృష్ణానాయక్ ఈ సారాను సరఫరా చేస్తున్నాడని, దాని తయారీ కోసం గోదాంలో దాచి పెట్టిన 300 కేజీల నల్లబెల్లం, 50 కేజీల ఆలం, 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసున్నట్లు ఎస్ఐ తెలిపారు. హాలియా ఎక్సైజ్ సీఐ కల్పన, ఎస్సై సంపత్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి, టీం లీడర్ ప్రదీప్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నర్సిరెడ్డి గెలుపుతోనే సమస్యల పరిష్కారం

చింతపల్లి, న్యూస్‌టుడే: వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ బలపర్చిన అల్గుబెల్లి నర్సిరెడ్డి గెలుపుతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆదర్శ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. సంఘం జిల్లా నాయకులు కోట్ల యాదగిరి, డి.సుందరయ్య, ఆనంద్‌కుమార్, శ్రీధర్‌రావు, ఏడుకొండల్, సంధ్యారాణి, భాగ్యమ్మ, అభిలాష్, వెంకట్‌రెడ్డి, వాసవి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏ, పీఆర్‌సీ, పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) జిల్లా ఉపాధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ ధర్మాగ్రహ దీక్షకు సంబంధించిన గోడ పత్రికలను స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో భోజన విరామ సమయంలో విడుదల చేశారు. ప్రధానోపాధ్యాయురాలు కండె ఉదయశ్రీ, అంజాచారి, అంజయ్య, రామ్మూర్తి, వరలక్ష్మి, జ్యోతి, సుకన్య, సైదారాణి, యమున, సంధ్యాభారతి, బిల్కిస్ పాల్గొన్నారు.

నేడు చింతపల్లి స్టేషన్‌లో మీట్ యువర్ ఎస్పీ

చింతపల్లి, న్యూస్‌టుడే: గ్రామస్థాయిలో ప్రజా సమస్యలపై ప్రజలు నుంచి దరఖాస్తులను పోలీస్‌స్టేషన్‌లో స్వీకరించేందుకు మీట్ యువర్ ఎస్పీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎస్సై యాదయ్య తెలిపారు. బాధితులు ఇచ్చే ఫిర్యాదులను నేరుగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఉదయం 11గంటల నుంచి బాధితుల దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

27న ఉచిత వైద్య శిబిరం

చింతపల్లి: మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఈనెల 27న ప్రసిద్ధ ఆసుపత్రి, చాట్ల కిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జూకూరి చైతన్యరాజు గురువారం తెలిపారు. శిబిరంలో అన్ని వ్యాధులకు ఉచిత పరీక్షలతోపాటు మందులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నల్గొండ ఎంపీ కె.రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కె.జైవీర్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసుల అదుపులో చోరీ నిందితుడు?

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గుర్రంపోడులోని ఆదిత్య మద్యం దుకాణంలో జరిగిన దొంగతనం కేసు నిందితుడు నల్గొండ సీసీఎస్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. విజయదశమి రోజు రాత్రి వైన్‌షాపులో రేకుల పైకప్పును పగులగొట్టి లోనికి ప్రవేశించి సుమారు రూ.10.80 లక్షల నగదును దొంగిలించిన ఘటన తెలిసిందే. అందులో నెల్లూరు జిల్లా కొవ్వూరుకు చెందిన నిందితుడు ఈ ప్రాంతంలో తిరుగుతూ వైన్స్‌లో దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు సీసీ కెమెరాల ద్వారా ప్రాథమిక ఆధారాలతో అంచనాకు వచ్చి నిందితుడిని వెతుకుతున్నారు. ఈ క్రమంలో దేవరకొండ డివిజన్ పోలీసులు, నల్గొండ సీసీఎస్ పోలీసులు బృందాలుగా గాలిస్తున్నారు. సదరు నిందితుడు రెండు రోజులక్రితం స్వగ్రామంలో ఉండగా పోలీసులు అదుపులోకి తీసుకొని ఆరాతీస్తున్నారు. మరో రెండు మూడురోజుల్లో పూర్తి వివరాలు రానున్నట్లు తెలుస్తోంది.

వర్గీకరణ, రిజర్వేషన్ల అమలుపై పోరాటం

పెద్దవూర, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ చేపట్టడం మంద కృష్ణమాదిగకు ఇష్టం లేదని మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు పిడమర్తి రవి ఆరోపించారు. గురువారం పెద్దవూరలో నియోజకవర్గ మాదిగ జేఏసీ ఇన్‌ఛార్జి బుడిగపాక లక్ష్మయ్య ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ మాదిగల హక్కుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ కేంద్రంలోని భాజపా ప్రభుత్వంతో కుమ్మక్కై రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. తెలంగాణలో 12శాతం రిజర్వేషన్ల కోసం పోరాటం చేస్తున్నామన్నారు. మాదిగ వర్గీకరణ కోసం సీఎం రేవంత్‌రెడ్డి అడుగు ముందుకేయగా మందకృష్ణ మాదిగ ఆయనను మాదిగ ద్రోహి అనడం సరైంది కాదన్నారు. జేఏసీ జిల్లా అధ్యక్షుడు కురపాటి సుదర్శన్, ఇరిగి గురునాధం, నక్క మహేష్, కలకొండ పరమేష్, జిల్లా కొండలు, ముత్యాలు, విద్యాసాగర్ తదితరులున్నారు.


పెద్దవూరలో మాట్లాడుతున్న మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు పిడమర్తి రవి

'మాల కులస్థులకు అన్యాయం'

చింతపల్లి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణతో మాల కులస్థులకు తీరని అన్యాయం జరుగుతుందని మాల మహానాడు మండల కన్వీనర్ గాదరి జంగయ్య విమర్శించారు. గురువారం మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాల కులస్థులందరూ కలిసికట్టుగా ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలన్నారు. దీనిపై నెల 24న హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సాలయ్య, యాదయ్య, వెంకటయ్య, భాస్కర్ తదితరులున్నారు.

బీసీ అధికారిపై ఆరోపణలు సరికాదు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: బీసీ ఐఏఎస్ అధికారి అమోయ్ కుమార్‌పై అవినీతి ఆరోపణలు సరికాదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. గురువారం మిర్యాలగూడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నీతి, నిజాయితీ కలిగిన బీసీ అధికారుల మనోధైర్యాన్ని దెబ్బతీయడం విచారకరమన్నారు. బంటు వెంకటేశ్వర్లు, శేఖర్, సైదులు, రవి తదితరులు పాల్గొన్నారు.


మిర్యాలగూడలో మాట్లాడుతున్న లింగంగౌడ్, తదితరులు

సందర్శనలు చేసి.. రైతులకు సూచనలిచ్చి

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: శిక్షణ ఐఏఎస్ అధికారుల బృందం గురువారం మండలంలోని పుట్టంగండి ఏఎమ్మార్ ప్రాజెక్టును సందర్శించింది. వీరు ప్రాజెక్టు పరిధిలోని అప్రోచ్‌కెనాల్, ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి పనితీరు ఈ నీటితో ఆయకట్టు రైతులకు కలిగే ప్రయోజనాలు అధ్యయనం చేశారు. అనంతరం పుట్టంగండి గిరిజనులతో మమేకమై వారి సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు జీవన విధానం, పంటల సాగు వివరాలు తెలుసుకున్నారు. డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సందర్శనలో ఎంపీడీవో చంద్రమౌళి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఏపీవో శ్రీనివాస్ తదితరులున్నారు.

చింతపల్లి,: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకొని అధ్యయనం చేసేందుకు సివిల్ సర్వీసెస్(శిక్షణ ఐఏఎస్) బృందం గురువారం మండలంలోని జర్పులతండాలో నాల్గో రోజు పర్యటించారు. పథకాలు, గ్రామానికి సంబంధించి సమాచారాన్ని ప్రజల నుంచి సేకరించారు. గ్రామంలోని అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులతో కలిసి శిక్షణ ఐఏఎస్ బృందం బతుకమ్మతో ఆటపాటలతో ఆడారు. గ్రామ నమూన చిత్రపటాన్ని దేవాలయం ముందు ముగ్గులతో ఏర్పాటు చేసి తిలకించారు. డా.మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గ్రామంలో అధ్యయం చేస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి కవిత, ఉపాధ్యాయులు హన్మంత్, సరిత తదితరులు పాల్గొన్నారు.



ఏఎమ్మార్ ప్రాజెక్టు పుట్టంగండి ఎత్తిపోతల పథకం వద్ద శిక్షణ ఐఏఎస్‌ల బృందం

గండమల్ల వెంకటేశ్వర్లుకు విప్లవ జోహార్లు

గుర్రంపోడు: మండలంలోని బొల్లారంలో మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందిన సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ సీనియర్ నాయకుడు గండమాల వెంకటేశ్వర్లు(75)కు ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాద్, జిల్లా కార్యదర్శి జక్కుల నర్సింహా విప్లవజోహార్లు అర్పించారు. నాలుగు దశాబ్దాలకు పైగా రైతుకూలీసంఘంలో పనిచేసిన వెంకటేశ్వర్లు మృతి పార్టీకి తీరని లోటని పేర్కొంటూ.. ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

ఏఎమ్మార్పీ మార్గం... కంపచెట్ల మయం

పెద్దఅడిశర్లపల్లి, న్యూస్‌టుడే: ఏఎమ్మార్ ప్రాజెక్టు రహదారులపై పర్యవేక్షణ లోపించింది. ఏళ్ల తరబడి కాల్వల వెంట రహదారులను అధికారులు కనీస నిర్వహణ చేపట్టకపోవడంతో ఆయా రహదారులు కంపచెట్లతో నిండిపోతున్నాయి. ప్రాజెక్టు పరిధిలో ప్రధానంగా ఏకేబీఆర్ దిగువన ప్రధాన కాల్వ 25.15వ కిలోమీటరు నుంచి మాధవరెడ్డికాలనీకి వెళ్లే పర్యవేక్షణ రహదారి ఇరువైపులా పెద్దఎత్తున్న కంపచెట్లతో నిండిపోయింది. కనీసం చిన్నచిన్న వాహనాలు ప్రయాణించలేని దుస్థితి నెలకొంది. స్థానిక రైతులు, నాగార్జునసాగర్ - హైదరాబాద్ రహదారిపై నుంచి ప్రాజెక్టు వీక్షించేందుకు వచ్చే పర్యాటకులు కంపచెట్లతో ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో ప్రాజెక్టు అధికారులు సైతం ఈ రహదారిపై ప్రయాణించేందుకు వీలులేకుండా కంపచెట్లు పెరిగిపోయాయి. పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టు అధికారులు స్పందించి ఈ రహదారిపై కంపచెట్లు తొలగించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' నీటిపారుదలశాఖ డీఈ నాగయ్యను వివరణ కోరగా ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ లైనింగ్, జంగిల్ క్లియరెన్స్ కోసం అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదిక పంపించామని, త్వరలో నిధులు మంజూరు కాగానే ఈ రహదారి వెంట కంపచెట్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఏకేబీఆర్ దిగువన ఇరువైపులా కంపచెట్లతో మూసుకుపోయిన ప్రధాన కాల్వ పర్యవేక్షణ రహదారి

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం:

బాషిపాక పవన్‌కుమార్, రైతు అక్కంపల్లి

నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారి నుంచి పీఏపల్లి మండలంలోని పలుగ్రామాలకు వెళ్లే ఈ రహదారిపై ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో రైతులు, ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పలువురు ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రాజెక్టు పరిధిలోని ఈ రహదారిని అధికారులు స్పందించి కంపచెట్లు తొలగించాలి.



ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా..!

మండల పరిధిలోని గొడుకొండ్ల గ్రామ పంచాయతీ పరిధిలో వెంకటేశ్వరనగర్‌లో హైవే రహదారి పక్కన ఉడిపి హోటల్ సమీపంలో మురుగు కాల్వ కప్పు కూలిపోయింది. ఇక్కడి నుంచి నిత్యం మహిళలు, చిన్నారులు, వృద్ధులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో కనిపించక ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు మరింత ఆందోళనకు గురవుతున్నారు. రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో మురుగు కాల్వపై కప్పును ఏర్పాటు చేసి ప్రమాదాల నుంచి కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి జర్పుల పద్మ తెలిపారు. - న్యూస్‌టుడే, చింతపల్లి

అవీ ఇవీ

మోదీ పాలనలో దేశం సురక్షితం... దేవరకొండ: మోదీ హయాంలో దేశం అభివద్ధితో పాటు సురక్షితంగా ముందుకు సాగుతుందని భాజపా ఓబీసీ మోర్చ రాష్ట్ర కార్యవర్గసభ్యులు నేతాళ్ల వెంకటేష్ అన్నారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. జెల్ల భాస్కర్, గీతారాణి, బిక్కు తదితరులున్నారు.

మంత్రికి క్షమాపణ చెప్పాలి.. మాడ్గులపల్లి: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి గాదరి కిశోర్ క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. మాడ్గులపల్లిలో గురువారం మాట్లాడుతూ.. నల్గొండ అభివృద్ధి కోసం కోమటిరెడ్డి అహర్నిశలు కృషిచేస్తోంటే ఆయనపై విమర్శలు చేయటాన్ని ఖండిస్తున్నామన్నారు.

ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేయాలి... పెద్దఅడిశర్లపల్లి: రాజకీయ జోక్యం లేకుండా గ్రామసభలతో ఇందిరమ్మ కమిటీలను ఎంపిక చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కంబాలపల్లి ఆనంద్ కోరారు. పీఏపల్లి మండలం పుట్టంగండిలో నిర్వహించిన సీపీఎం గ్రామశాఖ మహాసభలో ఆయన మాట్లాడారు. చంద్రూనాయక్, శంకర్, రాంకోటి, అంజయ్య, వెంకట్‌రాములు, విజయ పాల్గొన్నారు.

జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవాలి.. డిండి: విద్యార్థి దశ నుంచి జీవన నైపుణ్యాలను పెంపొందుకోవాలని ఎంఈవో గోప్యానాయక్ సూచించారు. గురువారం తవక్లాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ఏ1 పదో తరగతి పరీక్షల సరళిని ఆయన పరిశీలించి మాట్లాడారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి తదితరులున్నారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, **వెంకటేశ్వర:** వెనమ్, **శ్రీనివాస:** వేట్టయన్
విట్రోస్: దేవర, వేట్టయన్, విశ్వం, వెనమ్, పొట్టేల్